జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన దినపత్రికలో
జన్మదిన శుభాకాంక్షలు ....ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు...
కోర్టు నోటీసులు/పబ్లిక్/ కంపెనీ నోటీసులు
మొదలగు ప్రకటనల కోసం
ఈ 8886022523,9000621111
9948725373
నెంబర్లలో సంప్రదించగలరు

సంపుటి 16 సంచిక 39 విశాఖపట్నం ఆదివారం 01 అక్టోబరు 2023 8 పేజీలు వెల : 5.00



## 2014 పొత్తులు రిపీట్ అవుతాయా..?

# గజిబిజిగా... పొలిటికల్ చిత్రం..

ఆంధ్రప్రదేశ్‌లో పొత్తుల రాజకీయ చిత్రం.. చిత్ర విచిత్రంగా కనిపిస్తోంది. టీడీపీ-జనసేన మధ్య పొత్తు ఖాయం.. అలాగే బీజేపీ-జనసేన మధ్య కూడా పొత్తు ఖాయమే. కానీ బీజేపీ మాత్రం టీడీపీతో కలవనంటోంది.. అదే సమయంలో టీడీపీకి స్నేహ హస్తం అందిస్తోంది సీపీఐ. మరోవైపు కాంగ్రెస్ కూడా పొత్తుల్ని బలంగా కోరుకుంటోంది. మరి సైకిల్ స్టాండ్ ఏంటి..? కమలం రూట్ ఎటు? హస్తం ఇస్తున్న మెసేజ్ ఏంటి? ఎవరు ఎవరితో కలుస్తారు.. ఎవర్ని ఎవరు వదిలేస్తారు..? ఏపీలో ఆల్‌జీబ్రా పాలిటిక్స్.. పార్టీలఏపీలో పొలిటికల్ చిత్రం ఇలాగే గజిబిజి గందరగోళంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఒంటరిగానే పోటీ చేయబోతుంది. మరి విపక్షాల దారెటు? 2014 ఎన్నికల పొత్తు సీన్ రిపీట్ అవుతుందా..? లేదంటే ఈసారి రాజకీయ సమీకరణాలు మారుతాయా..? ఒకవేళ మారితే పొత్తుల చిత్రం ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతానికి బీజేపీతో జనసేన పొత్తులో ఉంది. అలాగే టీడీపీతోనూ దోస్తీ ఉంటుందని పవన్ కల్యాణ్ ప్రకటించారు. స్కిల్ స్కామ్ కేసులో అరెస్టయిన చంద్రబాబుతో ములాఖత్ అయిన పవన్.. ఆ తర్వాత కలిసి పోటీ చేస్తామని ప్రకటించారు. ఉమ్మడి పోరాటానికి సంబంధించి యాక్షన్ ప్లాన్ కూడా ఉంటుందన్నారు. అదే సమయంలో బీజేపీ కూడా కలిసి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కానీ టీడీపీతో పొత్తుకి బీజేపీ పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. కేవలం జనసేనతో మాత్రమే ఎన్నికలకు వెళ్లాలని భావిస్తోంది. ఈ క్రమంలో టీడీపీ-బీజేపీ మధ్య సయోధ్య కుదురుతుందా..? కుదరకుంటే పవన్ అడుగులు ఎలా ఉండబోతున్నాయన్నది రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.టీడీపీ-జనసేన మధ్య పొత్తు ఖరారైనట్టే. ఇక బీజేపీ కూడా కలిసొస్తే తమకు తిరుగు ఉండదన్నది టీడీపీ ప్లాన్‌గా కనిపిస్తోంది. కానీ అదంత ఈజీగా కనిపించడం లేదు. పైగా చంద్రబాబు అరెస్ట్ వెనుక బీజేపీ హస్తం ఉందన్న ఆరోపణలు మిన్నంటుతున్నాయి. ఈ క్రమంలో కమలం పార్టీ ఎలాంటి స్టాండ్‌తో ముందుకెళ్తుందన్నది సస్పెన్స్‌గా మారింది. మరోవైపు సీపీఐ నేతలు పొత్తులకు సిద్ధమని సంకేతాలిచ్చారు. కాకపోతే కూటమిలో కమలం ఉండకూడదని కండీషన్ పెట్టారు. అంటే టీడీపీ-జనసేనతో కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. కానీ ఇందుకు టీడీపీ, జనసేన సుముఖంగా కనిపించడం లేదు. మరోవైపు హస్తం పార్టీ కొత్త ఫార్మూలా తెరపైకి తెచ్చింది. కాంగ్రెస్‌తో టీడీపీ, జనసేన, లెఫ్ట్‌పార్టీలు కలిస్తే ఏపీలో క్లీన్ స్వీప్ గ్యారంటీ అన్నారు మాజీ కేంద్రమంత్రి చింతామోహన్. 175 అసెంబ్లీ.. 25 లోక్‌సభ స్థానాలు కూటమి గెల్చుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఫైనల్‌గా టీడీపీతో బీజేపీ కలుస్తుందా..? జనసేన లేకుండా బీజేపీ బరిలోకి దిగుతుందా? లెఫ్ట్ పార్టీలతో టీడీపీ, జనసేన పొత్తు సాధ్యమేనా? ఎవరి ప్రపోజల్ వారిది.. ఎవరి వ్యూహం వారిది. చివరగా మింగిల్ అయ్యేదెవరు..? సింగిల్‌గా మిగిలేదెవరు? ఏపీ నాట ఆల్‌జిబ్రా పాలిటిక్స్ మాత్రం ఆద్యంతం ఆసక్తి రేపుతున్నాయి.

# అక్టోబర్ 2న నారా భువనేశ్వరి నిరాహార దీక్ష



అమరావతి, : ప్రజాపాలన ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ పొలిటికల్ యాక్షన్ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ అక్టోబర్ 2న నారా భువనేశ్వరి నిరాహార దీక్ష చేయాలని నిర్ణయించారు. శనివారం నంద్యాలలో చంద్రబాబును అరెస్ట్ చేసిన ప్రాంతంలోనే టీడీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ- సమావేశం జరిగింది. ఈ సమావేశం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నేతృత్వంలో జరగగా, నారా లోకేష్ జూమ్‌లో పాల్గొన్నారు. చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్న ఆ పార్టీ ఇప్పుడు మరో కొత్త కార్యక్రమానికి పిలుపునిచ్చింది.అక్టోబర్ 2 రాత్రి 7 గంటల నుంచి 7.05 వరకు ప్రతి ఇంట్లో లైట్లన్నీ ఆర్పి ప్రజలు నిరసన తెలపాలని విజ్ఞప్తి చేసింది. లైట్లు ఆపి వరండాలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేయాలని సూచించారు. టీడీపీ-జనసేన సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ జేఏసీ రాష్ట్రస్థాయిలో పనిచేస్తూ రెండు పార్టీలకు అవసరమైన కార్యాచరణ, విధివిధానాలను రూపొందించేలా ప్లాన్ చేశారు.అలాగే ప్రభుత్వ వ్యతిరేక పోరాటాల్లో జనసేనతో సమన్వయం చేసుకుంటూ టీడీపీ కార్యకలాపాలు ఉండేలా కార్యాచరణను ఖరారు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇక ఈ సమావేశంలో నేతలు వైసీపీ తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేష్ పై సంబంధం లేని ఆరోపణలు చేస్తున్నారని, అసలు అక్కడ ఇన్నర్ రింగ్ రోడ్డే లేనప్పుడు కేసులు ఏంటని ప్రశ్నించారు. అసలు భూసేకరణ కూడా జరగలేదని,ఏమీ జరగని చోట ఏదో జరిగిందనే భ్రాంతికి గురిచేస్తున్నారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పీఏసీ కమిటీ చంద్రబాబుకు మద్దతు తెలిపినవారికి, బాసట గా నిలిచిన వారికి ధన్యవాదాలు తెలిపింది. చంద్రబాబు నాయుడు అరెస్ట్ అనంతరం ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాలు, తదుపరి చేపట్టాల్సిన కార్యక్రమాలపై యాక్షన్ కమిటీ భేటీలో చర్చించారు. బాబుతో నేను కార్యక్రమంతో పాటు ఓటర్ వెరిఫికేషన్‌ను ముందుకు తీసుకువెళ్ళాలని నిర్ణయించారు. ఇకపై జనసేనతో కలిసి కార్యక్రమాలు నిర్వహించే అంశంపై కూడా యాక్షన్ కమిటీ చర్చించింది.జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి యాత్రకు టీ-డీపీ పూర్తి మద్దతు ప్రకటించింది. జనసేన వారాహి యాత్రలో టీ-డీపీ శ్రేణులు నేరుగా పాల్గొనే విధంగా నిర్ణయం తీసుకున్నారు.

# ఎలక్టోరల్ బాండ్లు.. చట్టపరమైన లంచం: చిదంబరం



న్యూఢిల్లీ: ప్రజాపాలన ప్రతినిధి: ఎలక్టోరల్ బాండ్లను జారీ చేయడం చట్టపరమైన లంచం అని కాంగ్రెస్ నేత చిదరంబరం ఆరోపించారు. అక్టోబర్ 4వ తేదీ నుంచి పది రోజుల పాటు ఎలక్టోరల్ బాండ్లను ఓపెన్ చేస్తున్నట్లు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేత చిదంబరం ఆ ఆరోపణలు చేశారు. బీజేపీ సర్కార్‌కు ఇది బంగారు పంటగా మారుతుందని ఆయన విమర్శించారు. 28వ సారి ఎలక్టోరల్ బాండ్లను అనుమతి ఇస్తూ కేంద్ర సర్కారు శుక్రవారం ప్రకటన జారీ చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన అన్ని బ్రాంచిలలో అక్టోబర్ 4 నుంచి 13న వరకు 28వ విడత ఎలక్టోరల్ బాండ్లను విక్రయించనున్నట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం ఎలక్టోరల్ బాండ్లను విక్రయించనున్నట్లు తెలిపింది. గత రికార్డులను దృష్టిలో పెట్టుకుంటే, ఆ బాండ్లలో 90 శాతం వరకు బీజేపీకి వెళ్లనున్నట్లు కాంగ్రెస్ నేత చిదంబరం ఆరోపించారు. ఆశ్రిత పెట్టుబడిదారులు తమ చెక్ బుక్‌లను ఓపెన్ చేసి ఢిల్లీలో ఉన్న తమ మాస్టర్ కోసం సంతకాలు చేస్తారని పేర్కొన్నారు. ఎలక్టోరల్ బాండ్లను లీగల్ బ్రైబరీగా ఆయన విమర్శించారు. పొలిటికల్ ఫండింగ్‌లో పారదర్శకత కోసం నేరుగా నగదు విరాళాలు కాకుండా దానికి ప్రత్యామ్నాయంగా ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టారు. మార్చి 2018లో తొలిసారి ఎలక్టోరల్ బాండ్లను విక్రయించడం మొదలుపెట్టారు. కేవలం స్టేట్ బ్యాంక్ ఇండియాలో మాత్రమే ఆ బాండ్లను విక్రయిస్తారు.

# 2వేల నోట్ల మార్పిడికి గడువు పొడిగింపు

**అక్టోబర్ 7వరకు అవకాశం : ఆర్‌బిఐ వెల్లడి**




ముంబయి : ప్రజాపాలన ప్రతినిధి: రూ.2,000 నోట్ల మార్పిడికి గడువు పెంచుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నిర్ణయం తీసుకుంది. పెద్ద నోటు మార్పిడి, డిపాజిట్‌కు తొలుత సెప్టెంబర్ 30 నాటికి గడువు విధించిన విషయం తెలిసిందే. అక్టోబర్ 7వరకు ప్రజలు నోట్లను మార్చుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్‌బిఐ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. రూ.2000 నోట్ల ఉపసంహరణపై సమీక్ష జరిపిన ఆర్‌బిఐ మరోసారి నోట్లను మార్పుకునేందుకు గడువును పొడిగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. అప్పటి వరకు ప్రస్తుతం చెలామణిలో ఉన్న రూ.2వేలనోట్లు చట్టబద్ధంగా చెల్లుబాటవుతాయని స్పష్టం చేసింది. 2023 మే 16న రూ.2వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బిఐ వెల్లడించింది. దాదాపు 93 శాతం నోట్లు బ్యాంక్‌లకు తిరిగి వచ్చాయని సెప్టెంబర్ 2న తెలిపింది. బ్యాంక్‌లకు చేరిన మొత్తం నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలోకి రాగా.. 13 శాతం కరెన్సీనీ నోట్ల రూపంలోకి మార్చుకున్నారు. ఎవరివద్దనైనా రూ.2000 నోట్లు ఉంటే ఈ వారం రోజుల్లోనే బ్యాంకుల్లో, పోస్టాఫీస్‌లలో మార్చుకోవచ్చని సూచించింది.

# లోయలో పడ్డ పర్యాటకుల బస్సు..

**తొమ్మిది మంది మృతి**



తమిళనాడు: ప్రజాపాలన ప్రతినిధి: తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. పర్యాటకులతో వెళ్తున్న బస్సు నీలగిరి జిల్లా కున్నార్ - మెట్టుపాళయం జాతీయ రహదారిపై పక్కనే ఉన్న 50 అడుగుల లోయలో పడిపోయింది. ఘటన జరిగిన సమయంలో 54 మందితో వెళ్తున్న టూరిస్ట్ బస్సు బోల్తాపడింది. ప్రమాదంలో తొమ్మిది మంది మరణించినట్లుగా తెలుస్తున్నది. ఘటనలో చాలా మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఇందులో కొందరిని రక్షించి కున్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలంలో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మరికొందరి కోసం గాలిస్తున్నారు. అయితే, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నది. అయితే, ఊటీకి వెళ్లి తెన్‌కాశికి తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదం జరిగిన జరిగినట్లు తెలుస్తున్నది.



## 1న మార్టూరులో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలి



పర్చూరు, సెప్టెంబర్ 30, ప్రజా పాలన : పర్చూరు నియోజక వర్గ పరిధిలోని, మార్టూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో, ఈనెల 1న ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చా రు. ఏలూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో, మార్టూ రు జిల్లా పరిషత్ హైస్కూల్ లో, ఆదివారం ఉదయం 8గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల కు ఎలాంటి ఇబ్బందులు లేకుం డా, అన్ని ఏర్పాట్లు పూర్తి చేశా మన్నారు. నియోజకవర్గ ప్రజ లందరూ, ఈ అవకాశాన్ని ఉప యోగించుకుని, వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలన్నారు. కంటి వైద్యశిబిరంలో బి.పి.,షు గర్, రక్త పరీక్షలు నిర్వహించిన తర్వాత, కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అవ సరమైన వారికి, శంకర్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు అందిస్తారన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, సామా జిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థ లు, ప్రజా సంఘాలు ఈ వైద్య శిబిరంలో పాల్గొని సేవలందిం చాలని కోరారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిటి వరం

### శాసనసభ్యులు ముత్తం శెట్టి శ్రీనివాసరావు



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి సెప్టెంబర్ 30: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరమని భీమిలి శాసనసభ్యులు ముత్తంసెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఆనందపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూఆరోగ్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి పేదలకు ఇంటి వద్దకే వైద్యం అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారుఆరోగ్యశ్రీ ఆరోగ్య మిత్ర 104, 108 తో పాటు కుటుంబ డాక్టర్ విధానం ప్రవేశపెట్టి ప్రతి గ్రామములో వైద్య సేవలు నిర్వహించేటట్లుగా చేస్తున్నారన్నారుఅంతేకాకుండా ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబంలో ఉన్న ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారికి సరైన చికిత్స అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారుఈ సందర్భంగా 581 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి 33 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు అందించడానికి సిఫార్సు చేశారు.ఈ ఆరోగ్య శిబిరం కి ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యదికారులు తో పాటు విశాఖ పట్నం కేజీహెచ్ నుంచి స్పెషలిస్ట్ డాక్టర్స్ కూడా హాజరు అయ్యారు. మండలం లోని వివిధ గ్రామాల నుంచి అనేకమంది రోగులు ఈ మెగా వైద్య శిభిరం లో చికిత్స పొందారు.ఈ నెల 15 వ తేదీ నుంచి గ్రామాల్లో వాలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటిటి సర్వే నిర్వహించి వివిధ రోగాలతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించివారిని సిబ్బంది ఈ శిబిరానికి తీసుకువచ్చి వైద్య చికిత్స అందించారు. ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎం ఎల్ హెచ్ పీ లు నిర్వహించిన యోగ శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఆధునిక చికత్స అవసరమైన వారిని విశాఖ పట్నం లోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. ఈ కార్యక్రమం లో మండల ప్రత్యేక అధికారి పద్మ , నోడల్ అధికారి డాక్టర్ బి ఉమావతి, ఎంపీడీవో లవ రాజు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గంగు నాయుడు డాక్టర్ సహనాజ్ సాదియా,డి జి ఓ డాక్టర్ దుర్గా కళ్యాణి,డాక్టర్ భక్తవత్సలం మధురవాడ పిహెచ్సి వైద్యులు డాక్టర్ దీపిక దంత వైద్యులు డాక్టర్ విజయ్ కుమార్ సామాజిక ఆరోగ్య కార్యకర్త పి సాంబమూర్తి, స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి సూరిబాబు , ఉప సర్పంచ్ బంటుబిల్లి రమణమ్మ,మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు,సచివాలయం కన్వీనర్లు మీసాల పైడిరాజు, నాయకులు బిఆర్ బి నాయుడు, లంక రాంబాబు, పిన్నింటి వెంకటరమణ, బంక శ్రీను,చందక అప్పలస్వామి, ఇల్లాపు వెంకట్రావు,చందక అప్పలనాయుడు రౌతు వెంకట్రావు రౌతు శ్రీను, పినిశెట్టి సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఆర్ ప్రక్రియతో ప్రాణాపాయం తప్పించవచ్చు



చీరాల, సెప్టెంబర్ 30, ప్రజాపాలన : సిపిఆర్ ప్రక్రియతో ప్రాణాపాయం నుండి తప్పించ వచ్చని, ప్రతి ఒక్కరూ సీపీఆర్ (కార్డియోపల్మోనరీరిసస్సిటేషన్) పై అవగాహన కలిగి ఉండా లని, అంబేద్కర్ ఐడియాలాజీ ఫోరమ్ చైర్మన్, ప్రేమ హాస్పిటల్ అధినేత, ప్రముఖ హృద్రోగనిపు ణులు డాక్టర్ ఐ. బాబూరావు అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా, శని వారం చీరాలలోని ఆంధ్రరత్న పురపాలకోన్నత పాఠశాలలో గుండె జబ్బుల పై, సీపీఆర్ విధానం పై, విద్యార్థులకి అవ గాహన కల్పించారు. ఈ సంద ర్భంగా డాక్టర్ బాబూరావు మా ట్లాడుతూ,వయసుతో నిమిత్తం లేకుండా, గుండె సంబంధిత మరణాలు సంభవిస్తున్నాయ ని, హృదయ శ్వాస కోశ పున రుజ్జీవ చర్య (సీపీఆర్) ద్వారా, దీనికి తక్షణ ఉపశమనం కలి గించ వచ్చని, ఈ విధానాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాల న్నారు. గుండె పోటుకు గురైన వ్యక్తికి, సత్వరమే సీపీఆర్ అందిస్తే, వారి ప్రాణాలు కాపాడ వచ్చని సూచించారు. గుండెపో టు, శ్వాస తీసుకోలేని వ్యక్తుల ప్రాణాలు కాపాడేందుకు, సీపీ ఆర్ పై శిక్షణను ప్రతీ ఒక్కరూ నేర్చుకోవాలన్నారు. అత్యంత కీలకమైన సీపీఆర్పై, ప్రతి ఒక్క రూ అవగాహన కలిగి ఉండాల న్నారు.ఎమర్జెన్సీ సమయంలో, సీపీఆర్ ప్రక్రియను కొనసాగిం చక పోతే, మూడు నుంచి నా లుగు నిమిషాల తర్వాత, ఆక్సి జన్ లేకపోవడంతో, మనిషి బ్రెయిన్ డెడ్ అయ్యే ప్రమాదం పొంచి ఉ ందన్నారు. మారిన జీవన విధానం, పెరిగిన ఒత్తిడి తో, ఈ మధ్య కార్డియాక్ అరెస్ట్ వల్ల, నిమిషాల వ్యవధిలో ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాం టి కార్డియాక్ అరెస్ట్ సమస్య ఉత్పన్నం అయినప్పుడు, ఆ వ్యక్తికి సీ.పీ.ఆర్ చికిత్స చేస్తే, ప్రాణాన్ని కాపాడవచ్చన్నారు.ప్రస్తుత సమాజంలో మారిన ఆహార అలవాట్లు, జీవన విధా నంలో అనేక మార్పులు చోటు చేసుకోవడంతో, చిన్నా పెద్ద తేడా లేకుండా, గుండె సమస్య తో, ఉన్నట్టుండి కుప్పకూలిపో తున్నారన్నారు. అలాంటి సమ యంలో వారిని కాపాడేందుకు, ఒకే ఒక్క పరిష్కారం సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీససిటేషన్) ఎంతో ప్రయోజనకరం అని, ఈ పద్ధతిని అనుసరించి, గుండె లయను సాధారణ స్థాయికి, తీసుకువచ్చే అవకాశం ఉంద న్నారు. ఛాతి ఎడమ భాగంపై, చేతులతో ఒత్తిడి పెంచి, కృత్రిమ శ్వాస అందించడం ద్వారా, ప్రాణం పోసే అవకాశం ఉండడంతో, ఈ విధానం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, అందుకే విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఉరుకు ల పరుగుల జీవనం, మారు తున్న ఆహారం, పరిస్థితుల కారణంగా, అనేక మంది గుండె పోటుకు గురవుతున్నారన్నా రు. జీవన శైలిలో ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి , మంచి ఆహారం తో పాటు, ప్రతి రోజూ వ్యాయా మం చేయడం తప్పనిసరి చేసు కోవాలన్నారు. మంచి ఆరోగ్య కరమైన ప్రపంచాన్ని నిర్మించ డానికి, ప్రజలు మంచి ఆహారా న్ని తీసుకుంటూ, ప్రతిరోజు కొంత సమయాన్ని యోగా, వ్యాయా మాల కోసం కేటాయిం చాలన్నారు.ఆరోగ్యం పట్ల శ్రద్ధ, ఆసక్తి, బాధ్యత, సంకల్పం కలి గి, మంచి జీవన శైలితో సంపూ ర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవా లన్నారు. ప్రతి రోజూ నడకతో మొదలై యోగా, ఆట, పాటలు ద్వారా జీవనశైలిలో మార్పు వస్తే గుండెజబ్బులు, పక్షవా తం, బిపి, షుగర్ వంటి జబ్బు లు రాకుండా ఆరోగ్యాన్ని కాపా డుకోవచ్చని ఆయన తెలిపా రు. ప్రతిరోజు తీసుకునే ఆహా రంలో మార్పులద్వారా, సంపూ ర్ణ ఆరోగ్యం పొందవచ్చని, అం దుకు ప్రతి ఒక్కరు చిరుధాన్యా లను స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.సాల్మన్, వై.గాం ధీ ,పవని భానుచంద్రమూర్తి , విజయలక్ష్మి, సుశీల, ప్రసన్న కుమారి, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఇంటి వద్దకే మెరుగైన వైద్యం



ఎస్ఆర్ పురం, ప్రజాపాలన ప్రతినిది: ఎస్ఆర్ పురం మండలం దిగువ ముదికుప్పం పాఠశాల ఆవరణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన మండల మైనింగ్ ఏడి ప్రసాద్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఇంటి వద్దకే వైద్యం అందించాలని సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడం జరిగిందని అన్నారు. ప్రతి గడప వద్దనే ప్రజలకు ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయి నుంచి ఒక్క రూపాయి కూడా భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వచ్చే రోగులకు ఉచితంగా మందులు, కంటి పరీక్షలు అన్ని రకాల వ్యాధులకు తగు వైద్యం అందించడం పాటు గర్భిణీలకు, బాలింతలు రక్తహీనత బాధితులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఫుడ్ సప్లిమెంట్ ఉచితంగా అందిస్తున్నాం జరుగుతుందని తెలిపారు. అనంతరం ముదుకుప్పం గ్రామంలో వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, తాసిల్దార్ లోకనాథ్ పిళ్లై , మండల వైద్యాధికారిని పల్లవి, ఆరిమాకులపల్లి వైద్య అధికారి బాలసుబ్రమణ్యం రెడ్డి, సిహెచ్ఓ మునుస్వామి, అంగన్వాడి సూపర్వైజర్ భారతి, అంగన్వాడీ టీచర్ సుజాత, సూపర్వైజర్ గంగాదేవి ,ఫార్మసిస్ట్ జగదీష్, ఎం ఎల్ హెచ్ పి కవిత, ఆశా కార్యకర్త చంద్రకళ, విఆర్వో ప్రశాంత్ ,మహిళా పోలీస్ పుష్పలత, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రదీప్, సర్పంచ్ గిరిబాబు, శీనయ్య ,ఎంపీటీసీ సిద్దయ్య నాయకులు జనార్ధన్ ,నాగమణి, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఐ.ఆర్ ను వెంటనే ప్రకటించాలి: ఎపిటిఎఫ్




గుంటూరు ప్రజాపాలన : రాష్ట్ర ప్రభుత్వం జులై,2023 నుండి ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఐ.ఆర్ (మధ్యాంతర భృతి ) ను వెంటనే ప్రకటించాలనీ ఎపిటిఎఫ్ (1938) డిమాండ్ చేస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందు వేళాంగణిరాజులు తెలిపారు. గుంటూరు నందలి నగరంపాలెం నందలి జిల్లా కార్యాలయం లో ఎపిటిఎఫ్ ముఖ్య నాయకులు సమావేశం జరిగింది.ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్టె బోయిన నరసింహ రావు మాట్లాడుతూ పెండింగ్లో నున్న మూడు డి.ఎ ( కరువు భత్యం) ను వెంటనే మంజూరు చేయాలనీ కోరారు.జిల్లా అధ్యక్షులు గోవిందు వేళాంగణిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల లోని విద్యుత్ బిల్లు లను గ్రామ పంచాయతీలు చెల్లింపు చేసేటట్లు చర్యలు తీసుకోవాలనీ కోరారు.జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు మాట్లాడుతూ 117 జి.ఓ ను తక్షణమే రద్దుచేసి, ఈ జి.ఓ వలన విద్యారంగం లో జరిగిన నష్టాన్ని వెంటనే పూరించాలనీ కోరారు. రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జె.విజయానంద్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు ఎం.ఇ.ఓ పోస్ట్ లను మంజూరు చేయాలనీ కోరారు.ఈ సమావేశంలో నాయుకులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ ను నెలకొ ల్పటమే జగనన్న లక్ష్యం

**వైఎస్సార్ సిపి చీరాల నియో జకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు**
**జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమం దేశానికే తలమానికం**
**పేదవారికి సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ధ్యేయం**
**స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, వైసీపీశ్రేణుల్లోఉత్సాహం నింపిన వైసిపి ఇన్చార్జి వెంకటేష్**



చీరాల, సెప్టెంబర్ 29, ప్రజా పాలన : ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ ను నెలకొల్పటమే లక్ష్యంగా, పేదవారికి సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ధ్యేయంగా, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశా నికే తలమానికమని, వైఎస్సా ర్ సిపి చీరాల నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు.చీరాల మండ లం దేవినూతల గ్రామంలో, వేటపాలెం మండలం కొత్తపేట గ్రామంలోనూ ఏర్పాటు చేసిన, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్ర మాలలో, వైసిపి ఇంచార్జీ కర ణం వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి వెంకటేష్ మాట్లాడుతూ, ఆంధ్ర ప్రదేశ్ లో ప్రతి ఒక్కరి ఆరోగ్యమే లక్ష్యం గా, క్షేత్ర స్థాయి నిశ్శబ్ద విప్లవం లా, జరుగుతున్న జగనన్న ఆరో గ్య సురక్ష కార్యక్రమం, దేశానికే తలమానికంగా నిలుస్తుందన్నా రు. ప్రజలకి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు,ముఖ్య మంత్రి ఆరోగ్య సురక్ష కార్యక్ర మానికి శ్రీకారం చుట్టారన్నారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి, ప్రాథమిక వైద్య పరీక్షలను నిర్వహించి, అనారోగ్య సమ స్యలను గుర్తించి, వారికి ఉచితంగా వైద్యం అందించడంతో పాటు, సలహాలు, సూచనలు కూడా ఇవ్వడం, ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ప్రధ మ లక్ష్యమన్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సంద ర్శించి, స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని నాయ కులను, కార్యకర్తలను ఉత్సా హ పరిచారు. చీరాల మండలం దేవినూతల సచివాలయం పరి ధిలో, జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివా సరావు, వైసిపి చీరాల మండ ల అధ్యక్షులు ఆసాది అంకాళ రెడ్డి, ఆర్బీకే చైర్మన్ కావూరి రమణ రెడ్డి, జగనన్న ఆరోగ్య సురక్ష స్పెషల్ ఆఫీసర్ షేక్ సత్తార్, తహసీల్దార్ ప్రభాకర రావు, ఎంపీడీఓ నేతాజీ, ఏపీ ఎం సుబ్బారావు, మెడికల్ ఆఫీసర్ శ్రీదేవి, చీరాల మండ లం జేసీఎస్ ఇంచార్జీ బుర్ల సాంబశివరావు, వల్లు వేదాద్రి, పర్వతనేని శ్రీను, ముచ్చు దేవేం ద్ర, డాక్టర్లు జయకుమార్,రమ్య శ్రీ, సచివాలయ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వేట పాలెం మండలం కొత్త పేట-1 సచివాలయం పరిధిలో, జరిగి న జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమంలో, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, వేటపాలెం మండలం అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు,జగనన్న ఆరోగ్య సురక్ష స్పెషల్ ఆఫీసర్ జె.దెబోరా,ఎంపీడీఓ రూతుమ్మ,ఏపీఎం శ్రీనివాసరావు,మెడికల్ ఆఫీసర్ శ్యాంసన్, వేటపాలెం మండలం జేసీఎస్ ఇంచార్జీ లేళ్ల శ్రీధర్, మాజీ సర్పంచ్ చుండూరు వాసు, మారుబోయిన పాపారావు, శర్మ, పాకల శ్రీను, చింతలపూడి తులసి రామ్, జమ్మి బాబీ, మారుబోయిన గోపి, బుర్ల శివ, జమ్మి ప్రసాద్ రెడ్డి, చీరాల వేటపాలెం మండల నాయకులు, డాక్టర్లు బాల రాజు, బాల కృష్ణ,అంజలి దేవి,సచివాలయ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సేవా భావానికి ప్రతిరూపమే ఎన్ఎస్ఎస్.వ్యవసాయ సలహా మండలి (ఆర్.బి.కె) చైర్మన్ కావూరి రమణారెడ్డి

**డా.ఎన్ టి ఆర్ ఆహార విజ్ఞా న సాంకేతిక కళాశాల ఎన్ఎస్ ఎస్ విభాగం సేవా కార్యక్రమా లు స్ఫూర్తిదాయకం**





చీరాల, సెప్టెంబర్ 30, ప్రజా పాలన : సేవా భావానికి ప్రతిరూ పమే ఎన్ఎస్ఎస్ అని, డాక్టర్ ఎన్.టి.ఆర్.ఆహార విజ్ఞాన సాం కేతిక కళాశాల ఎన్.ఎస్.ఎస్ విభాగం వారు, వారి విద్యార్థుల తో కలిసి, నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయక మని, వ్యవసాయ సలహా మండలి (ఆర్.బి.కె) చైర్మన్ కావూరి రమణారెడ్డి నిర్వాహ కులను ప్రశంసించారు.చీరాల మండలం, కావూరివారిపాలెం లో డా.ఎన్ టి ఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల ఆధ్వర్యంలో, నిర్వహిస్తున్న ఎన్.ఎస్.ఎస్.ప్రత్యేక శిబిరంలో భాగంగా, ఉచిత పశువైద్య శిబి రాన్ని ఏర్పాటు చేశారు. సుమా రు 55 గేదెలకు, బాపట్ల వ్యవ సాయ కళాశాల యానిమల్ హస్బండరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కాకాని విజయప్రకాష్ అధ్య క్షతన చికిత్స అందించారు. దాదాపు 35 గేదెలకు, గర్భకోశ సంబంధిత మందులు,18 గేదె లకు నట్టల వ్యాధి నివారణ మందులు అందజేశారు. అనం తరం గ్రామంలోని ఎంపీపీ పాఠ శాలలో, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, చదువు పట్ల చిన్నవయసు నుంచే ఎలా ఆసక్తి పెంచుకోవాలో, పెద్దల పట్ల మర్యాదగా ఎలా నడుచు కోవాలో వివరిస్తూ, విద్యార్థుల ను ప్రోత్సహించారు. కార్యక్ర మంలో చీరాల రైతు భరోసా కేంద్రం చైర్మన్ రమణారెడ్డి పాల్గొని, గ్రామ ప్రజలు ఎన్ ఎస్ ఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్. ఎస్.ఎస్.ఆఫీసర్స్ డా. విమల బీరా, బ్లెస్సి సాగర్ ల పర్యవేక్ష ణలో, వ్యాయామ అధ్యాపకు లు డా.ఫణీంద్ర కుమార్ ప్రోత్సా హంతో, రానున్న రోజుల్లో మరి న్ని సేవా కార్యక్రమాలను చేపడ తామని ఎన్.ఎస్.ఎస్.వాలంటీ ర్లు స్పష్టం చేశారు.

# "సమాజాన్ని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితి కి నడిపించేది కవిత్వం"

## యోగి వేమన విశ్వ విద్యాలయంప్రొఫెసర్ ఎన్. ఈశ్వర రెడ్డి







విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి:సమాజాన్ని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితి కి నడిపించేది కవిత్వమని, ఆయా కాలాల లోని సామాజిక అంశాలు కవిత్వాన్ని ప్రభావితం చేస్తాయని యోగి వేమన విశ్వ విద్యాలయంప్రొఫెసర్ ఎన్. ఈశ్వర రెడ్డి అన్నారు. మనిషి సమూహంగా ఏర్పడినప్పటి నుంచి భాష ఆవిర్భవించి వుంటుంది అని, భావ వక్తీకరణ సమర్ధవంతంగా జరిగేందుకు ''సాహిత్యం'' ఆవశ్యకత ఏర్పడిందని ఆయన అన్నారు. సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వరం లో నిర్వహించే ఆన్ లైన్ శిక్షణా తరగతుల్లో జర్నలిజం డిప్లమా విద్యార్థుల్ని, రాష్ట్రం లోని వర్కింగ్ జర్నలిస్టుల్ని ఉద్దేశించి శనివారం(30. 09. 23) ఆయన "సాహిత్యం - సమాజం - కవిత్వం" అంశం పై ప్రత్యేక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భావ నిగూఢత కలిగి, సాధారణ వాక్యం కన్నా భిన్నం గా వుండే వాక్యాల కలయికను ''సాహిత్యం'' గా చెప్పవచ్చని ఈశ్వర రెడ్డి అన్నారు. " గ్రామీణులు తమ కష్ట సుఖాలకు అనువైన కళారూపాల్ని సమాజానికి పరిచయం చేశారని ఆయన అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు పూర్వం, సాగు కు సంబంధించిన అనేక క్రతువులు గురించి, తమ సాధక బాధకాల గురించి జానపద సాహిత్యం పాటల రూపం లో మనకు అందిందని ఆయన అన్నారు. జానపద సాహిత్యం లో పెద్ద పెద్ద ప్రయోగాలు గాని, లోతైన భావ జాలం గాని ఉండవని, అతి సరళంగా నాటి సమాజం, మనస్సు చుట్టూ అల్లుకున్న భావాలు మాత్రమే వుండి చెవులకింపుగా వుంటాయని ఆయన తెలిపారు. అక్షర జ్ఞానం లేకపోయినా నాటి గ్రామీణులు భావ వ్యక్తీకరణకు జానపద కవిత్వాన్ని సమాజానికి అందించారని ఆయన అన్నారు.తొలి దశలో 'కథ', 'కవిత్వం' కలిసే ఉన్నాయని, ఆధునిక కాలంలో మాత్రమే కథ, కవిత్వం వేరు పడ్డాయని ఆయన చెప్పారు. నన్నయ, తిక్కన కాలాన్ని సాంప్రదాయ కవిత్వ కాలం గా చెప్పవచ్చని, సమాజాన్ని చైతన్య పరిచే విధంగా, సామాన్య ప్రజలకు క్రమశిక్షణ, ఇతర ప్రయోజనకర అంశాల్ని ప్రభోదించేవి గాను భారత, భాగవతాది గ్రంథాలు వుండేవని ఆయన చెప్పారు.అనంతర కాలంలో సాహిత్యం సమాజ ప్రయోజనాలకు అనుగుణంగా నడిచిందని, దీనిని ఆధునిక కవిత్వం గా చెప్పవచ్చని ఆయన అన్నారు. ప్రజా కవి వేమన, పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్య, పోతులూరి వీర బ్రహ్మం వంటి కవులు సుమారు 4 వందల సంవత్సరాల క్రిందటే కుల,మత,లింగ, వయో భేదం లేని సమ సమాజం గురించి ప్రభోదించారన్నారు. అనంతరం కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావుల కాలం నుంచి ప్రజలకు అవసరమైన వస్తువే(అంశవే) కవిత్వ వస్తువైందన్నారు. కన్యాశుల్కం నాటకం లో గురజాడ వారు సృష్టించిన పాత్రలు ఇప్పటికీ మన చుట్టూ వున్న సమాజంలో కనిపిస్తూనే వుంటాయన్నారు. మానవాభివృద్ధే లక్ష్యంగా ఆధునిక కవిత్వానికి కథ కు, నాటకానికి గురజాడ ఆద్యులని ఆయన ప్రస్తుతించారు. గురజాడ వారు రచించిన "దేశమును ప్రేమించుమన్నా, మంచి యన్నది పెంచుమన్నా" దేశ భక్తి గీతం అన్ని కాలాలకు, దేశాలకు సరిపోయే కవిత్వం అని ఆయన అన్నారు. భోగ వస్తువు గా భావించిన "స్త్రీ" కి ఆత్మగౌరవం, స్వతంత్రంగా ఆలోచించే హృదయం వుంటాయని ప్రకటించిన ''భావ కవిత్వ'' ప్రక్రియకు దేవులపల్లి కృష్ణ శాస్త్రి ఆద్యులని ఆయన తెలిపారు.దీనికి కొంత భిన్నంగా సాగిన "శ్రీ శ్రీ" శైలి, గుడిపాటి వెంకటాచలం వంటి వారు ఈ ప్రక్రియను మరింత ప్రయోజనకరంగా ముందుకు తీసుకు వెళ్లగలిగారన్నారు. సాహిత్యం ఒక దశ నుంచి వేరొక దశకు మారుతున్న సందర్భంలో కవులు, రచయితలు స్పందించే తీరు వేరు వేరు గా ఉండడాన్ని గమనించ వచ్చన్నారు. సాహిత్యం అధ్యయనం చేయడం జర్నలిస్టులకు మరింత ప్రయోజనకారిగా వుంటుందని దాని వల్ల రచనా శైలి, భాష ప్రయోగం ప్రత్యేకత సంతరించుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఆన్ లైన్ శిక్షణా తరగతులకు సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కోర్సు డైరెక్టర్ ఎల్.వి.కె రెడ్డి వక్తను పరిచయం చేశారు. కంటెంట్ ఎడిటర్ శరత్, సి.ఆర్. మీడియా అకాడమీ డేటా ప్రోసెసింగ్ ఆఫీసర్ లోవరాజు సమన్వయ కర్తలుగా వ్యవహరించారు.

# గడపగడపకు అపూర్వ ఆదరణ





రాజుపాలెం ప్రజాపాలన : అడుగడుగునా ఆత్మీయ సహకరింపులు, ఇంటింటా ఆశీర్వచనాలు, ఎదురేగి మహిళల స్వాగతాలు, అందరి ప్రశంసల మధ్య పండుగ వాతావరణం లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం సాగింది. శుక్రవారం మండల పరిధిలోని ఆర్ఎన్ఆర్ సెంటర్ (కొత్త బోధనం) గ్రామంలో జరిగిన గడపగడపకు కార్యక్రమంలోరాష్ట్ర జల వనరుల శాఖ మాత్యులు అంబటి రాంబాబు పాల్గొన్నారు. ఆయనతో పాటు పూర్వ శాసనసభ్యులు యర్రం వెంకటేశ్వర రెడ్డి , స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు. అమ్మ .. అమ్మబడి అందిందా, పెద్దాయన పెన్షన్ అందుతుందా చెల్లెమ్మ చేయూత వచ్చిందా ?అంటూ ఆత్మీయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలపై ఆరాతీస్తూ ,వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు.ఈ సందర్భంగా మంత్రి అంబటి స్థానికులతో మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా పాదయాత్రలోఇచ్చిన హామీలను 98 శాతం యువ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేసి చూపించాలన్నారు. సంక్షేమ అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారన్నారు. ఇంటి స్థలాలు, ఇంగ్లీష్ మీడియం చదువులు, పరిపాల వికేంద్రీకరణ, సమతుల అభివృద్ధి, సంస్కరణలతో కూడిన ఆలోచన విధానమే ప్రజల ఆశీర్వచనాలకు కారణమన్నారు. పారదర్శకమైన సంక్షేమ అందిస్తున్న ఈ ప్రభుత్వానికి మీరందరూ అండగా ఉండాలని కోరారు. 228 కుటుంబాలను ఆయన సందర్శించారు. వాలంటీర్ల సేవలపై ఆయన ఆరా తీశారు.స్థానికుల సమస్యలను విని అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. మురుగుకాల్వల ఆధునీకరణ, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు , సిసి రోడ్ల నిర్మాణం, వంటి సమస్యలు స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి రూ 20 లక్షల గ్రాంట్ వస్తుందని వీటితో వనరుల, వసతుల కల్పన కల్పిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఇక్కడ సమస్యలు పరిష్కరం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాశం మహాలక్ష్మమ్మ, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, మండల కన్వీనర్ వేపురి శ్రీనివాసరావు మండల అభివృధి కమిటి చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, బాసులింగారెడ్డి, దొంతి రెడ్డి శ్రీనివాసరెడ్డి, చంద్రమౌళి, పాశం నరసింహారెడ్డి , జె సి ఎస్ మండల ఇన్చార్జి పిలిబండ్ల అశోక్, సత్తెనపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ పెండెం బాబురావు, ఎంపీడీవో టి శ్రీనివాసరావు, తహసిల్దార్ అష్రఫ్ ఉన్నీసా బేగం, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ వారాహి యాత్రను విజయవంతం చెయ్యండి

**రాజుపాలెం జన సేన పార్టీ ఉపాధ్యక్షులువసుపులేటి వెంకట స్వామి**



రాజుపాలెం ప్రజాపాలన :అక్టోబర్ 1 నుంచి కృష్ణా జిల్లాలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర మొదలు కానుందనీ రాజుపాలెం మండల జనసేన పార్టీ ఉపధ్యక్షులు పసుపులేటి వెంకట స్వామి శనివారం ఓ ప్రకటన లో భాగంగా తెలియజేసారు. ఈ సందర్భంగా వెంకట స్వామి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ అక్టోబర్ ఒకటి నుంచి నాలుగో విడత వారాహి యాత్ర ప్రారంభిస్తారని తెలిపారు. అలానే తొలిరోజు అవనిగడ్డలో బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. 2, 3 తేదీల్లో మచిలీపట్నంలో ప్రజలు, నాయకులతో సమావేశం అవుతారన్నారు. జనవాణి ద్వారా సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. నాలుగో తేదీన పెడనలో వారాహి యాత్ర ఉంటుందని చెప్పారు. జనసేనాధిపతికి దారి పొడవునా స్వాగతం పలికేందుకు జనం ఎదురు చూస్తున్నారన్నారు. చేనేత కార్మికులను కలిసి వారి ఇబ్బందులు తెలుసుకుంటారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని మండిపడ్డారు. ఐదో తేదీన కైకలూరులో వారాహి యాత్ర కొనసాగుతుందని కావున రేపు ప్రారంభం అయ్యే వారాహి యాత్ర నేపథ్యంలో సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు వారాహి యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# అణగారిన వర్గాల రాజ్యాధికారమే పవన్ లక్ష్యం: బొర్రా

**సత్తెనపల్లి పట్టణం జనసేన పార్టీ కార్యాలయంలో ఎస్సీ,ఎస్టీ సదస్సులో పాల్గొని,ప్రసంగించిన బొర్రా వెంకట అప్పారావు**



సత్తెనపల్లి ప్రజాపాలన :బొర్రా మాట్లాడుతూ వావిలాల పుట్టిన గడ్డపై పుట్టినందుకు గర్వపడుతున్నను.నాలుగు సార్లు ఎమ్మెల్యే గెలిచి ఈ ప్రాంతాన్ని ఎస్సీ ఎస్టీ సహోదరులను అభివృద్ధి చేశారు.ఇక్కడి రూములు ఎస్సీ ఎస్టీలకు చేశారు.జగన్మోహన్ రెడ్డి ఒక అవకాశం ఇవ్వండనీ ఎస్సీ ఎస్టీలు హక్కులు హరించారు.రాజధాని కావాలి ఉద్యోగ అవకాశాలు కావాలి. అకౌంట్ లో డబ్బులు వేసి బానిసలు చేస్తున్నాడు.ఎస్సీ ఎస్టీ డబ్బులు నవరత్నాలకు వాడి మాయ. ఎస్సీలు ఇళ్లకు ఇవ్వటం జరిగిందా. 15 20 లక్షలు పొలాలుకొని 40,50 లక్షలు అమ్మకొని జేబు నింపుకుంటున్నాడు. డాక్టర్ సుధాకర్, సుగాలి ప్రీతి, భవ్య శ్రీ మొదలైన వారికి అన్యాయం జరిగింది. ఎంతకాలం గ్రామాల్లో వేరే వారి వద్ద పనిచేస్తారు. రెండు సామాజిక వర్గాలు రెండు పార్టీలు ఉన్నప్పటికీ, ఈ కార్యక్రమానికి వచ్చిన మీ అందరికీ ధన్యవాదాలు..ఇక్కడికి వచ్చిన అందరికీ నమస్కారం పెడుతున్నాను. గెలిచిన వాళ్ళను కూడా లాక్కున్నారు. ఓ పార్టీ 40 ఏళ్ల నుండి ఓ పార్టీ 50 ఏళ్ళనుంది ఉన్న మిమ్మల్ని పట్టించుకోలేదు. పవన్ కళ్యాణ్ కావాలని ఓడించారు. పొడుగు బలహీనవర్గాలు కోసం రాజ్యాధికారం రావడం కోసం పవన్ కళ్యాణ్ వచ్చాడు. నీకోసం కష్టపడుతున్నాడు పనిచేస్తున్నాడు. భారతదేశంలో పొత్తులు లేకుండా రాజకీయం లేదు. ఇదేమి నేరం ఘోరం కాదు. పవన్ కళ్యాణ్ రాజ్యాధికారం తీసుకొస్తాడు. ఒక్కసారి పవన్ నమ్ముదాం ఆయన నాయకత్వం లో పనిచేద్దాం. అరెస్ట్ తప్పనలేదు అరెస్టు చేసిన విధానాన్ని తప్పని మాత్రమే అన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమే ఆయన ఆలోచిస్తున్నాడు.కిడ్నీ బాధితులు, రైతుల ఆత్మహత్యలు ప్రజా సమస్యల గురించి ఆలోచిస్తున్నారు. ఈ ప్రభుత్వం ఇసుక మైన్ చాలా దోస్తులను చూస్తున్నాను.నాణ్యమైన మద్యం లేక ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారు ప్రజలు.కొన్ని తరాలపాటు తీరని అప్పు మద్యపానం పై చేశాడు.ఈ ముఖ్యమంత్రి ప్రజలను బానిసలుగా మారుస్తున్నారు.వావిలాల స్ఫూర్తితో స్వతంత్రంగా బతుకుతాం.ప్రతి గ్రామంలో ఇంటింటికి పవనన్న బాట ఏర్పాటు చేయండి .ఎమ్మెల్యే పదవి ఒకటైన చాలా ఉంటాయి. పొత్తులో భాగంగా మనకు అవకాశాలు వస్తాయి. పదవి గురించి కాదు ఆశయం కోసం వచ్చాను నాకు ఎటువంటి పదవి లేదు. అధికారాన్ని పంచుకుందాం, అధికారాన్ని కైవసం చేసుకుంటాం.ఈ కార్యక్రమంలో కృష్ణ పెన్నా మహిళ రీజనల్ కోఆర్డినేటర్ పార్వతీ నాయుడు గారు, జిల్లా కమిటీ వారు, మండల అధ్యక్షులు, ఎస్సీ నాయకులు ఎస్సీ నాయకులు జనసైనికులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రవేశపెట్టినదే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం: ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వే కోడూరు : అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలో ని అనంతరాజుపేటలో ఈరోజు ఉదయం రాష్ట్రంలోని ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా ఇంటింటి సర్వే ద్వారా అనారోగ్యంతో వున్న వారిని గుర్తించి, వైద్య శిబిరాలను నిర్వహించి చికిత్స అందించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని జగనన్న ప్రవేశపెట్టిన కార్యక్రమమే ఆరోగ్య సురక్ష అని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఈ రోజు ఉదయం రైల్వే కోడూరు మండలం అనంతరాజుపేట-1 గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన "జగనన్న ఆరోగ్య సురక్ష"వైద్య శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మొన్నటి వరకు ఏదైనా జబ్బు వస్తే మండల కేంద్రానికి వైద్యం చేయించుకునే వారని, నిన్న ఊళ్లోనే విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటుచేసి వైద్యం అందించే వారని, నేడు ఇంటింటికి తిరిగి జల్లెడ పట్టి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారి ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరిచడమే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

# నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ లో తీవ్ర గందరగోళం




నూజివీడు, ప్రజాపాలన ప్రతినిధి: పట్టణంలో అంతర్గత రహదారుల కు గ్రావెల్ తోలకంపై అధికార వైసిపి, ప్రతిపక్ష టీడీపీ కౌన్సిల్ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో 16 అంశాలు ఎజెండాలో ప్రవేశపెట్టారు. నాలుగవ అంశమైన గ్రావెల్ రోడ్లు వేయుట గురించి టిడిపి ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ లేవనెత్తుతూ కౌన్సిలర్లకు తెలియకుండా పనులు నిర్వహించటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ కుమార్ కు కూడా గ్రావెల్ తరలించే విషయం తెలియదని చెబుతున్నారని, అధికారులకు తెలియక, ప్రజా ప్రతినిధులకు తెలియక, ఈ పనులకు అజమాయిషీ ఎవరు అంటూ గట్టిగా ప్రశ్నించారు. దీనిపై దుర్గాప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ ల మధ్య వాదోపవాదాలు పెరిగాయి. ఎంతో కాలం నుండి తమ సూచిస్తున్న గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి ముందుకు రానందుకు, చైర్ పర్సన్, కౌన్సిల్ సభ్యులకు గౌరవం లేనందున ఈ సమావేశాలు ఎందుకంటూ వాక్ అవుట్ చేస్తున్నామన్న దుర్గాప్రసాద్ ఎజెండా కాపీలను చించి వేసి సమావేశం నుండి బయటకు వచ్చారు. దుర్గా ప్రసాద్ ను అనుసరిస్తూ టిడిపి కౌన్సిల్ సభ్యులు దాసరి వెంకటస్వామి, కొమ్మని విజయ, తిరుమల శెట్టి సాధన లక్ష్మీ స్రవంతి, మలిశెట్టి ప్రియదర్శిని లు కౌన్సిల్ హాలు నుండి వాక్ అవుట్ చేశారు. అనంతరం ఎజెండాలోని మిగిలిన అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చ కొనసాగించారు.

# పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్ ప్రవేశ ప్రకటన

భీమిలి ప్రజాపాలన ప్రతినిధి సెప్టెంబర్ 30: భీమిలి లోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా కోర్సులలో మిగులు సీట్లు (సీసీపీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాలలో తక్షణ ప్రవేశాలకు అక్టోబర్ 3న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. హెచ్ మురళీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-2023 ప్రవేశ పరీక్ష రాయకపోయినా, పదో తరగతి కంపార్ట్ మెంటల్ ద్వారా పాసైన విద్యార్థినులు కూడ ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా సీటు పొందుగోరు అభ్యర్థినులకు ఎలాంటి ఫీజు రాయితీ, స్కాలర్ షిప్ సౌకర్యం లభించదని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థినులు ఎస్.ఎస్.సి మార్కులిస్ట్, పాలిసెట్-2023 హాల్ టికెట్ పరీక్షకు హాజరైనచో, టి.సి, క్యాస్ట్ సర్టిఫికేట్, స్టడీ సర్టిఫికేట్, ఆధార్ సర్టిఫికేట్ ఒరిజినల్స్, 5 సెట్స్ జిరాక్స్ కాపీలు, పాస్ ఫోటోస్ 3, ఫీజు రూ.6 వేలు - తో అక్టోబర్ 3 వ తేదీన ఉదయం 9-30 గంట లకు భీమునిపట్నం లోగల మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు హాజరు కావలసిందిగా ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9912342045 నంబర్ ను సంప్రదించాలని ఆయన కోరారు.

bahujan bazaar బహుజన బజార్ www.bahujanbajaar.in bahujan bazaar



మిత్రులందరికీ జై భీం,

మన పోరాట యోధురాలు ఝల్‌కరీ భాయి చరిత్రను వక్రీకరించి ఝాన్సీలక్ష్మీబాయి చరిత్రను మన చేత ప్రచారం చేయించిన విషయం మీకు తెలుసు దీనకి కారణం మన రచయితలకు మనం ప్రోత్సహించకపోవడం. అదేవిధంగా మన రచనలు ప్రతి ఊరులో అందుబాటులో లేకపోవడం వల్ల మన బహుజనవాదం వెనుకబడుతున్న విషయం కూడా మన అందరికి తెలుసు.

అందువల్ల బహుజన రచనలను అన్నింటిని మీరు ఆర్డరు చేసిన వెంటనే మీకు అందించే విధంగా చేద్దాం. బహుజన రచయితలను ఆర్థికంగా బలోపేతం చేయడం వల్ల మన చరిత్రలను వెలికితీసే విధంగా చేద్దాం. పుస్తకాలను కొనండి, చదవండి, హాస్టల్ పిల్లలకు బహుమానం ఇవ్వండి.

లాభాలు

బహుజన బజార్‌లో పుస్తకాలు కొనండి, చదవండి, చదివించండి. హాస్టల్ పిల్లలకు బహుమతిగా ఇవ్వండి

ఉచితం: రూ.1000/- తో సభ్యత్వం తీసుకున్న వారికి సంవత్సర కాలంలో పుస్తకాల రవాణా ఖర్చులు ఉచితం.
రూ.500/- లకు పైన కొనుగోలు చేసే పుస్తకాలపై రవాణా ఖర్చులు ఉచితం.

ప్రతి యొక్క బహుజనుడు కనీసం ఒక పుస్తకాన్ని కొని హాస్టల్ పిల్లలకు ఉచితంగా ఇచ్చి బహుజనాభివృద్ధి తోడ్పడండి.

జై భీం, జై పూలే, జై బహుజన

డాక్టర్ కె.శివ భాగ్యారావు బహుజన IRS-vrs
చైర్మన్, స్నేహ గ్రూప్

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
ఆదివారం 01,అక్టోబరు 2023

# అన్నీ ఉన్నా అభివృద్ధి లేదెందుకు?

మన దేశానికి ఎంతో ఘన చరిత్ర, సహజ వనరులు, అత్యధిక యువ జనాభా, మేధో సంపద ఉన్నా 75 ఏండ్లలో అనుకున్నంత అభివృద్ధిని సాధించలేకపోయాం. మన కంటే చిన్న దేశాలతో కూడా మనం ఎందుకు పోటీ పడలేకపోతున్నాం? ఇన్నేండ్లు దేశాన్ని పాలించిన పార్టీలు, నాయకులు చేసిందేమిటి? తెలంగాణ మాత్రం ఇతర రాష్ట్రాలు, దేశానికి భిన్నంగా ప్రగతి పథంలో ముందుకు దూసుకెళ్లడానికి కారణాలేమిటి తెలుసుకోవాలంటే నేటి వేదిక పేజీలోని సమగ్ర వ్యాసాన్ని చదవండి.ఘనమైన చరిత్ర, అత్యధిక యువ జనాభా, అపారమైన సహజ వనరులు, అద్వితీయమైన మేధో సంపద మన దేశానికి సొంతం. కానీ మన కన్నా తక్కువ వనరులు కలిగిన దేశాలతో మనం అభివృద్ధిలో పోటీ పడలేకపోతున్నాం. ప్రపంచ ప్రగతి సూచికల్లో చివరి స్థానాల్లో ఉంటున్నాం! తలసరి ఆదాయంలో మనం చాలా వెనుకబడి ఉన్నాం. ఇన్నేండ్లు దేశాన్ని పాలించిన పాలకుల రాజకీయ ప్రయోజనాలు, మూస విధానాలే ఇందుకు కారణం. కానీ తెలంగాణ మాత్రం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదర్శవంతమైన పథకాల కారణంగా ప్రగతి పథంలో ముందుకు దూసుకెళుతున్నది.జనాభాపరంగా భారతదేశం ఇటీవల చైనాను అధిగమించి ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచింది. వైశాల్యంలో రష్యా, కెనడా, అమెరికా, చైనా, బ్రెజిల్, ఆస్ట్రేలియా తరువాత 7వ స్థానాన్ని ఆక్రమించింది. అనేక సహజ వనరులు ఉన్న గొప్ప దేశం మనది. అత్యధిక యువశక్తి, శ్రమైక జీవులు, మేధో సంపద కలిగిన దేశం. ప్రపంచంలోని అనేక దేశాలను తన మేధో వలసల ద్వారా సుసంపన్నం చేస్తున్న దేశం. మనం అత్యంత ప్రాచీన సింధూ నాగరికతకు వారసులం. ప్రపంచానికే జ్ఞానబోధ చేసిన తక్షశిల, నలంద, నాగార్జున కొండ విద్యాలయాలు విరాజిల్లిన పుణ్యభూమి మనది. గంగ, యమున, సరస్వతి, నర్మద, బ్రహ్మపుత్ర, మహానది, కావేరి, గోదావరి, కృష్ణా, తపతి తదితర పుణ్య నదులకు నెలవైన పవిత్ర భూమి. ఘనమైన సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు భారత దేశం. ఇంతటి ఘనమైన చారిత్రక నేపథ్యం గల భారతదేశం అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో ఎందుకు పోటీ పడలేక పోతున్నది?సుదీర్ఘ కాలం సాగిన భారత స్వాతంత్ర్య పోరాటంలో అనేక తరాలు పాల్గొన్నాయి. అనేక ఉద్యమాలు, త్యాగాలు, బలిదానాల ఫలితంగా చివరికి గాంధీజీ నేతృత్వంలో సాగిన అహింసాయుత పోరాటం ఫలించి దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న మహా నాయకులు దేశ పాలకులుగా కొనసాగిన కాలంలో దేశం నిర్దేశించుకున్న లక్ష్యాలను కొంతమేరకు సాధించాం. ఆ తర్వాతి కాలంలో పాలకుల నిర్వాకం వల్ల అభివృద్ధి, స్వేచ్ఛ, సమానత్వం క్రమంగా కనుమరుగవుతూ వచ్చాయి! దేశ ప్రజల విశాల ప్రయోజనాలకు భిన్నంగా పాలకులు తమ, తమ పార్టీల రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వంలో కొనసాగడమే సర్వస్వంగా భావిస్తూ దిగజారుతూ వస్తున్నారు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మారడంలో భారత్ వెనుకబడే ఉన్నది. ఎలాంటి చారిత్రక నేపథ్యం లేని అమెరికా కొన్ని శతాబ్దాల కాలంలోనే తన పకడ్బందీ ప్రణాళికలతో, కఠోర శ్రమతో, పాలన నైపుణ్యంతో ప్రపంచ మేధోశక్తిని ఆకర్షిస్తూ అగ్రదేశంగా ఎదిగి కొనసాగుతున్నది. 1949లో స్వాతంత్ర్యం పొంది, కటిక పేదరికంలో మగ్గి, 1980 వరకు భారత్ కంటే వెనుకబడి ఉన్న చైనా గడిచిన 40 ఏండ్ల కాలంలో స్వయంకృషి, స్వీయ ప్రతిభతో శరవేగంగా తనను తాను తీర్చిదిద్దుకుంటూ అగ్రరాజ్యమైన అమెరికాకు సవాల్ విసురుతున్నది. ఏ వనరులు లేని, వలసలతో ఏర్పడిన చిన్న దేశమైన సింగపూర్ నేటికీ మట్టిని, నీటిని సైతం దిగుమతి చేసుకుంటూ అచిరకాలంలో సమర్థ పాలనతో గొప్ప దేశంగా ఎదిగి అనేక దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నది. భారత సహకారంతో స్వాతంత్ర్యం పొందిన బంగ్లాదేశ్ పరిమిత వనరులతో 50 సంవత్సరాలలోనే అనేక రంగాల్లో భారత్ కంటే ముందున్నది. రెండో ప్రపంచ యుద్ధంలో అణుబాంబుల దాడికి గురై శ్మశాన వాటికగా మారిన జపాన్ తేరుకొని కఠోర శ్రమ, ప్రణాళికాబద్ధ పాలనతో గతానికి మించిన ప్రగతి సాధించి తలుచుకుంటే ఏదైనా సాధించి తీరుతానని నిరూపించింది.కానీ భారతదేశం ఏ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నదో మచ్చుకు కొన్ని సూచికలు పరిశీలిద్దాం. 2022లో ప్రపంచ ఆకలి సూచిక 121 దేశాలకు గాను మన దేశం 107వ స్థానంలో నిలిచింది. పొరుగు దేశాలైన పాకిస్థాన్ (99), బంగ్లాదేశ్ (84), నేపాల్ (81) కంటే మన దేశం వెనకబడి ఉన్నది. 2021-22లో మానవాభివృద్ధి సూచికలో 191 దేశాలకుగాను మన దేశం 132వ స్థానంలో ఉన్నది. ఆర్థిక మాంద్యంతో విలవిల్లాడిన వెనిజులా(120) మన కంటే మెరుగ్గా ఉన్నది. 2023లో ప్రపంచ శాంతి సూచికలో 163 దేశాలకు గాను మనం 126వ స్థానంలో ఉన్నాం. 2021లో జరిగిన ఒలింపిక్స్‌లో భారత్ 48వ స్థానంలో నిలిచింది. భారత్ కంటే ఎన్నో రెట్లు చిన్నవైన సెర్బియా, క్యూబా, ఉగాండా, ఉజ్బెకిస్థాన్, పోలెండ్ వంటి దేశాలు భారత్ కంటే మెరుగైన ప్రతిభను కనబరిచాయి.భారతదేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తున్నదని కేంద్ర ప్రభుత్వ పాలకులు చెప్పే మాటలు ప్రజలను మభ్యపెట్టేవే కానీ ఫలితం ఇచ్చేవి కావు. 33 కోట్ల జనాభా గల అమెరికా బడ్జెట్ స్థాయికి, 145 కోట్ల జనాభా ఉన్న భారత్ చేరుకోవాలంటే ఎన్ని దశాబ్దాలు పడుతుంది? అప్పటికి అమెరికా బడ్జెట్ ఎంతకు చేరుకుంటుంది?జనాభాలో భారత్‌కు దాదాపు సమానంగా ఉన్న చైనా నేటి బడ్జెట్‌ను భారత్ సమీప భవిష్యత్తులో చేరుకోవడం సాధ్యమేనా? మన కన్నా చాలా చిన్న దేశాల కంటే ఎక్కువ బడ్జెట్ కలిగి ఉన్నామని చెప్పి మనం మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నామని చెప్పడం సంబురపడే విషయం కానే కాదు. తలసరి బడ్జెట్‌లో మనం మూడో స్థానంలో కాదు కదా పదవ స్థానంలో కూడా లేము.దేశంలో కురిసే చక్కటి వర్షపాతం వల్ల అవసరాలకు మించి జల సంపద మన నదుల్లో పారుతూనే ఉంది. నీళ్లుండి కూడా 40 కోట్ల ఎకరాల సాగు యోగ్యమైన భూమికి నీళ్లివ్వకపోవడం క్షమించరాని తప్పిదం. నేటికీ అనేక రాష్ట్రాల్లో తాగునీటి కోసం కిలోమీటర్ల కొద్దీ నడిచే దుస్థితి నెలకొన్నది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలకు కూడా సరిగ్గా నీళ్లు ఇవ్వడం లేదు. వేల టీఎంసీల నీళ్లు సముద్రం పాలవుతున్నాయి. అతివృష్టి, అనావృష్టితో దేశం విలవిల్లాడుతున్నది. ప్రకృతి ప్రసాదించిన వనరులను సక్రమంగా సద్వినియోగం చేసుకునే ప్రణాళికలు, ముందుచూపు పాలకుల్లో కానరావడం లేదు. ఈ పరిస్థితి దశాబ్దాలుగా కొనసాగుతున్నది. తెలంగాణ రాష్ట్రం మాత్రం ఇందుకు మినహాయింపు. కారణం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలతో ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అన్ని రంగాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించింది.

# ఏకాభిప్రాయం లేకుండానే దేశం పేరు మార్చడమా !

''ఇండియా అనే భారత్, రాష్ట్రాల సమాఖ్య'' అని ఆర్టికల్ 1 చెప్తుంది. ఈ పదాలు ఏ విధంగానూ, 'ఇండియా', 'భారత్' అనే పదాల పరస్పర మార్పును సూచించడం లేదు. 'భారత్' అనే పదాన్ని 'ఇండియా' అనే పదం స్థానంలో దేశ అధికారిక పేరుగా పయోగించవచ్చనే అర్థాన్ని కూడా సూచించడంలేదు. వాస్తవానికి, ఆర్టికల్ 394 (ఎ) కింద ...రాష్ట్రపతి అధికారం కింద ప్రచురించబడిన హిందీ భాష లోని రాజ్యాంగంలో తప్ప, 'భారత్' అనే పదాన్ని, రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ లోనూ ఉపయోగించలేదు. ఏకాభిప్రాయం లేకుండానే దేశం పేరు మార్చడమా!




భారతదేశం అధ్యక్షతన న్యూఢిల్లీలో జరుగుతున్న జి-20 శిఖరాగ్ర సమావేశాల సందర్భాన్ని పురస్కరించుకొని, రాష్ట్రపతి భవన్, 'ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా'కు బదులుగా 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' పేరుతో అధికారికంగా పంపిన ఆహ్వానం వివాదాస్పదం అయ్యింది.ఈ ఆకస్మిక మార్పుకు సంబంధించి, ఇంతవరకు ప్రభుత్వ అధికార ప్రతినిధి నుండి ఎలాంటి వివరణ ఇవ్వలేదు. రాష్ట్రపతి పేరుతో అత్యంత లాంఛనప్రాయమైన అధికారిక సమాచారం లోని ఆకస్మిక మార్పును దేశం ఊహించలేదు. మన రాజ్యాంగంలోని ఆర్టికల్1 లో పేర్కొన్న విధంగా దేశం పేరును భారత్‌గా కూడా మార్చవచ్చు, అందువల్లే భారత్ అనే పదాన్ని ఉపయోగించారని అధికార పార్టీ సమర్థకులు మాట్లాడుతున్నారు. ఈ సందర్భంలో, దేశం పేరును భారత్ అని మార్పు చేయడానికి పార్లమెంటులో తీర్మానం చేయాల్సిన అవసరం ఉంటుందని ఇంకెవరో అన్నారు. వాస్తవానికి, మొన్న జరిగిన ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లోనే అది చెయ్యాలని సూచనలు కూడా వచ్చాయి. భారత సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు కొంతమంది కూడా ఈ అభిప్రాయానికి తమ అంగీకారాన్ని తెలియజేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.దేశం పేరు మార్పు సమస్య, అది నిర్వహించబడుతున్న తీరును పరిగణలోకి తీసుకోవడానికి ముందు, రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా ఏ సమయంలోనైనా దేశం పేరును మార్చే అధికారం పార్లమెంటుకు ఉంటుందనే విషయం స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగంలోని ఏ నిబంధనైనా (ఆర్టికల్1లో పేర్కొన్న విధంగా దేశం పేరుతో సహా) సవరించే అధికారాన్ని రాజ్యాంగం లోని ఆర్టికల్ 368 పార్లమెంట్‌కు కల్పిస్తుంది. అయితే ఈ విషయంలో ఎలాంటి అవగాహనకూ ఉపకరించని విధంగా మూకుమ్మడి గగ్గోలు చెలరేగి ప్రజలను నిర్ఘాంతపరచింది.

రాజ్యాంగం ప్రకారం...

కాబట్టి, రాజ్యాంగం ప్రకారమే దేశం పేరు మార్పుకు సంబంధించిన సమస్యను నిష్పక్షపాతంగా పరిశీలించి చూద్దాం. మొదటిది, రాష్ట్రపతి భవన్ నుండి బయటకు వచ్చిన ఆహ్వానం. ఆ ఆహ్వానంలో "ప్రెసిడెంట్ ఆఫ్ భారత్" అనే పేరును ఉపయోగించారు. వాస్తవానికి, రాజ్యాంగబద్ధంగా మాట్లాడితే, ప్రస్తుత పరిస్థితుల్లో మన దేశంలో ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అనేది లేదు. ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ఉండాల్సిందేనని ఆర్టికల్ 52 చెప్తుంది. రాష్ట్రపతికి అధికారికంగా ఉపయోగించే పేరు, ''ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా''. ఆర్టికల్ 52ను తగిన రీతిలో సవరించకుండా ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా పేరును ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చకూడదు. కాబట్టి, "ప్రెసిడెంట్ ఆఫ్ భారత్" అనే పదాలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 52కు అనుగుణంగా లేవనేది చాలా స్పష్టం. "ఇండియా అనే భారత్, రాష్ట్రాల సమాఖ్య'' అని ఆర్టికల్ 1 చెప్తుంది. ఈ పదాలు ఏవిధంగానూ, 'ఇండియా', 'భారత్' అనే పదాల పరస్పర మార్పును సూచించడం లేదు. 'భారత్' అనే పదాన్ని 'ఇండియా' అనే పదం స్థానంలో దేశ అధికారిక పేరుగా ఉపయోగించవచ్చనే అర్థాన్ని కూడా సూచించడంలేదు. వాస్తవానికి, ఆర్టికల్ 394(ఎ) కింద...రాష్ట్రపతి అధికారం కింద ప్రచురించబడిన హిందీ భాష లోని రాజ్యాంగంలో తప్ప, 'భారత్' అనే పదాన్ని, రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ లోనూ ఉపయోగించలేదు. ఒకవేళ, 'భారత్' అనే పదాన్ని పరస్పరం మార్పు చేసుకోడానికి ఉపయోగించుకునే ఉద్దేశ్యం రాజ్యాంగ నిర్మాతలకే ఉండి ఉంటే, ఆర్టికల్ 393 ప్రకారం ఏర్పడిన అధికారిక భారత రాజ్యాంగంలోని కొన్ని భాగాలలో ఆ పదాన్ని ఉపయోగించి ఉండేవారు. ఈ సందర్భంలో, ఆర్టికల్ 1లో ఉపయోగించబడిన ''ఇండియా, అనే భారత్" (ఇండియా దటీజ్ భారత్) అనే పదాల నిజమైన అర్థాన్ని అవగాహన చేసుకునే ప్రయత్నం చేద్దాం. 'దట్ ఈజ్' అనే పదాలు, వాటికి ముందున్న 'ఇండియా' అనే పదాన్ని వివరిస్తాయి. అందువలన, ఇండియా అనే భారత్ రాష్ట్రాల సమాఖ్య అని ఆర్టికల్ 1 చెపుతుంది. హిందీ అనువాద భారత రాజ్యాంగం ''భారత్ అంటే ఇండియా'' అని చెప్తుంది.

దీనిని బట్టి, ఇండియాకు అనువాదమే భారత్ అని తెలుస్తోంది. ఇంకో విధంగా చెప్పాలంటే, భారత రాజ్యాంగంలోని మూల గ్రంథంలో 'భారత్' అనే పదం స్వతంత్ర పదంగా ఉండదు. దీనిని కేవలం హిందీ అనువాద రాజ్యాంగంలో మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది. "ఈ అనువాద రాజ్యాంగం ఖచ్చితంగా మూల రాజ్యాంగంలోని అర్థాన్నే వివరించాలని" ఆర్టికల్ 394ఏ (2) చెప్తుంది. ఈ నిబంధన, భారత్ అనే పదం, మూల రాజ్యాంగంలో ఉపయోగించబడిన 'ఇండియా' అనే పదానికి అనువాదమనీ, చట్టబద్ధంగా దానిని మార్చేంతవరకు, దేశానికి 'ఇండియా'నే అధికారిక పేరని నొక్కి చెప్తుంది.

**గందరగోళం...**

అధికారిక సమాచారంలో "ఇండియా"కు బదులుగా ''భారత్''ను ఉపయోగించడంతో పెద్ద గందరగోళం సృష్టించబడింది. మన దేశానికి అధికారికంగా రిపబ్లిక్ ఆఫ్ ఇండియా అనే పేరు ఉంది. విదేశాలకు, అంతర్జాతీయ సంస్థలకు అధికారికంగా పంపించే సమాచారంలో 'ఇండియా' అనే పేరునే ఉపయోగిస్తారు. విదేశాలతో కుదుర్చుకునే ఒప్పందాలు, ఒడంబడికలు రిపబ్లిక్ ఆఫ్ ఇండియా పేరుతోనే జరుగుతాయి కానీ, రిపబ్లిక్ ఆఫ్ భారత్ పేరుతో జరగవు. ఒకవేళ భారత్ అనే పేరును పరస్పర మార్పుకు ఉపయోగిస్తే, విదేశీ ప్రభుత్వాలు మొత్తం గందరగోళంలో పడిపోతాయి. విదేశీ ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, కంపెనీలతో కుదుర్చుకునే ఒప్పందాల్లో ఇండియాను రిపబ్లిక్ ఆఫ్ ఇండియాగా చూపిస్తారు, కొన్నింట్లో రిపబ్లిక్ ఆఫ్ భారత్ గా చూపిస్తారు. ఒక దేశం, ఒకే అధికారిక పేరును కలిగి ఉండొచ్చు. అది ఉంటే, ఇండియా లేదా భారత్ గా ఉండాలి కానీ, రెండూ ఉండకూడదు. ''రాష్ట్రాల సమాఖ్యగా ఇండియా'' ఉంటుందనే ఆర్టికల్1 లోని మాటలు, రాజ్యాంగ ముసాయిదాలో ఉన్నట్లు రాజ్యాంగ పరిషత్ చర్చల అధ్యయనం తెలియజేస్తుంది. ఇండియాకు బదులుగా భారత్‌ను ఉపయోగించాలని అనేకమంది సభ్యుల అధిక ఒత్తిడి కారణంగా చర్చలు జరుగుతున్న సందర్భంలో భారత్ అనే పదాన్ని చేర్చారు. హెచ్.వి.కామత్, కె.టి.షా, సేఠ్ గోవింద్ దాస్, శిబ్బన్ లాల్ సక్సేనా లాంటి సభ్యులు అనేక సూత్రీకరణలను సూచించారు. కానీ, రాజీ మార్గంగా బి.ఆర్.అంబేద్కర్ "దట్ ఈజ్ భారత్ " అనే పదాలను చేర్చారు. పరస్పర మార్పులో భాగంగా ''భారత్''ను ఉపయోగించవచ్చని మూల రాజ్యాంగంలో ఆయన ఒక్కసారి కూడా చెప్పలేదు.ఒక దేశం పేరు మార్పు ఒక రాజకీయ పార్టీ ఎజెండాగా ఉండకూడదు. వైవిధ్యం గల భారత్ లాంటి దేశంలో, పేరు మార్పుపై ఏకాభిప్రాయాన్ని సాధించాల్సిన అవసరం ఉంది.

దేశంలో ఏ మూలనున్న ప్రజలైనా దేశం పేరుతో మానసిక ఉద్వేగ సంబంధాలు కలిగి ఉంటారు. లేకుంటే అది కొన్ని వర్గాలలో పరాయీకరణ భావనను సృష్టిస్తుంది. భారతదేశ గత వలస భావన నుండి విముక్తి కావాలన్న వింత ఆలోచన.... రాష్ట్రపతి భవన్, పార్లమెంట్, అసెంబ్లీ భవనం లాంటి వలసవాద చిహ్నాలను ధ్వంసం చేయడానికి దారి తీసి, మొత్తం పరిపాలనా నిర్మాణాన్నే మార్చే పరిస్థితి ఏర్పడుతుంది. అలాగనుకుంటే...భారతదేశంలో ఉన్న మొత్తం రైల్వే వ్యవస్థ కూడా గత వలస పాలకుల చిహ్నమే. మరి హఠాత్తుగా పుట్టుకొచ్చిన ఈ సరికొత్త వలసవాద వ్యతిరేక ప్రతాపం...ఇటీవలే ముగిసిన అంతర్జాతీయ సమ్మేళనంలో వినిపించిన 'వసుధైక కుటుంబకం' జపంతో ఏమైనా పొసిగేలా వుందా మరి?

# మానవతామూర్తికి నివాళి

భారత హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ ఇకలేరన్న వార్త యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. పేదల ఆకలిదప్పులు తెలిసిన మహనీయుడు, రైతుబాంధవుడు, మహిళా అభ్యున్నతికి పాటుపడిన కృషీవలుడు దూరమయ్యారని తెలిసి నేలతల్లి సైతం కంటతడి పెట్టిందన్న భావోద్వేగ వర్ణనలు అతిశయోక్తులు కావు. దేశాన్ని 'ప్రపంచ బెగ్గింగ్ బౌల్' వంటి అవమానకర పరిస్థితుల నుంచి 'ప్రపంచ బ్రెడ్‌బాస్కెట్'గా తీర్చిదిద్దడంలో స్వామినాథన్ కృషి ఎంతో శ్లాఘనీయం. 1943 నాటి బెంగాల్ డొక్కల కరువు పరిస్థితులకు స్వామినాథన్ చలించిపోయారు. ఆయన కుటుంబమంతా వైద్య వృత్తిలో స్థిరపడినా..వ్యవసాయ పరిశోధనలపై దృష్టి సారించి ప్రపంచ ప్రఖ్యాత అమెరికా వ్యవసాయ శాస్త్రవేత్త నార్మన్ బోర్లాంగ్‌తో కలిసి భారత్ పరిస్థితులకు, వాతావరణానికి అనుగుణంగా అధిక దిగుబడినిచ్చే గోధుమ, వరి వంగడాల సృష్టిలో అమోఘమైన పాత్ర పోషించారు. ఆహార కొరతతో తల్లడిల్లిన పరిస్థితుల నుంచి దేశాన్ని గట్టెక్కించి ఆహార స్వయం సమృద్ధి, నిల్వ, ధాన్యాల ఎగుమతి చేసే దిశగా పట్టాలెక్కించారు. ఇదే మన దేశంలో హరిత విప్లవానికి పునాది వేసింది.పొలాల్లో అధిక దిగుబడులను సాధించడానికి మాత్రమే ఆయన కృషిని పరిమితం చేయలేదు.. ప్రపంచ పేదల ఆకలి గిన్నెల నిండా ఆహారం నింపాలని సంకల్పించిన మహనీయుడు స్వామినాథన్. ఆ తపనే ఆయనను గొప్ప శాస్త్రవేత్తగా, విద్యావేత్తగా, దౌత్యవేత్తగా, పర్యావరణవేత్తగా అన్నింటికి మించి గొప్ప మానవతావాదిగా తీర్చిదిద్దింది. భారత్‌లోనే కాకుండా ప్రపంచ జనుల ఆకలి తీర్చడంలోనూ శ్లాఘనీయమైన పాత్ర పోషించినందుకు 1987లో తొలి ప్రపంచ ఆహార పురస్కారం ఆయను వెతుక్కుంటూ వచ్చింది. ఈ బహుమతి కింద లభించిన దాదాపు రూ.1.67 కోట్ల (2 లక్షల డాలర్లు) మొత్తంతో భావి తరాలకు పరిశోధనల ఫలాలను అందించాలనే తలంపుతో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎంఎస్ఎస్ఆర్ఎఫ్) నెలకొల్పడం ఆయన నిస్వార్థతకు అద్దం పడుతుంది. 'పర్యావరణ హితం, పేదల అభ్యున్నతి, మహిళాభ్యున్నతి' లక్ష్యాలతో గ్రామీణాభివృద్ధి, సుస్థిరాభివృద్ధి విధానాలకు రూపకల్పన చేయడంలో ఎంఎస్ఎస్ఆర్ఎఫ్ ఎనలేని సేవలందిస్తూ దేశంలోనే అగ్రగామి పరిశోధన సంస్థగా నేడు పరిఢవిల్లుతోంది. ప్రఖ్యాత టైమ్స్ పత్రిక '20 శతాబ్దిలో ఆసియాలో అత్యంత ప్రభావశీలుర జాబితా'లో భారత్ నుంచి మహాత్మాగాంధీ, రవీంద్రనాథ్ టాగుర్‌తో పాటు స్వామినాథన్‌కు మాత్రమే చోటు దక్కింది. మరో రెండేళ్లలో నిండు నూరేళ్లు పూర్తి చేసుకోనున్న ఆయన జీవితాంతం వ్యవసాయ పరిశోధనలు, ఆహార భద్రత, పర్యావరణ పరిరక్షణ, రైతులు, పేదలు, మహిళల జీవితాలను మెరుగుపర్చేందుకే పరితపించారు. శాస్త్రవేత్తలు, పాలకులు, రైతుల మధ్య సమర్థవంతమైన సమన్వయంతోనే వ్యవసాయాభివృద్ధి సాధ్యపడుతుందని స్వామినాథన్ నిర్దేశించారు. వ్యవసాయ రంగ సంక్షోభం, రైతు ఆత్మహత్యలపై అధ్యయనం కోసం 2004లో నియమించిన జాతీయ వ్యవసాయ కమిషన్‌కు నేతృత్వం వహించిన ఆయన రెండో హరిత విప్లవానికి అసరమైన ప్రతిపాదనలు సమర్పించారు. వ్యవసాయోత్పత్తుల నిల్వ, మార్కెట్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడంతో పాటు నీటి పారుదల, సాగు పెట్టుబడులు, పంటల బీమా, రుణ సహాయం వంటివి విస్తరింపజేయాలని సూచించారు. ప్రధానంగా రైతు కుటుంబ శ్రమ విలువను జత చేసి సమగ్ర సాగు ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి (సి2ం50) కనీస మద్దతు ధర పంటలకు అందిస్తేనే రైతన్న మనుగడ సాధ్యమని ఘోషించారు. ప్రస్తుతం కేరళలో వామపక్ష ప్రజాతంత్ర కూటమి ప్రభుత్వం.. గతంలో త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లోని వామపక్ష ప్రభుత్వాలు మాత్రమే వ్యవసాయాభివృద్ధికి స్వామినాథన్ మార్గంలో కృషి చేశాయి. కానీ స్వామినాథన్ సూచించిన ఫార్ములాతోనే కనీస మద్దతు ధర కల్పిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన బిజెపి అన్నదాతలను నిలువునా వచించింది. చరిత్రాత్మక రైతు మహోద్యమంలోనూ చట్టబద్ధమైన ఎంఎస్‌పి కల్పనే ప్రధాన డిమాండ్‌గా ముందుకొచ్చింది. చట్టబద్ధమైన ఎంఎస్‌పి సాధించడంతో పాటు పర్యావరణహితమైన, ప్రజానుకూల విధానాలతో వ్యవసాయాభివృద్ధికి కృషి చేయడమే స్వామినాథన్‌కు ఘనమైన నివాళి. ప్రజాహితం కోసం జీవితాన్ని అంకితం చేసిన మానవతామూర్తికి అక్షరాంజలి.

# జక్లైర్ - క్రిష్ణా నూతన రైల్వే మార్గాన్ని నేడు జాతికి అంకితం చేయనున్న నరేంద్ర మోదీ

హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ, అక్టోబరు 01 2023న మహబూబ్ నగర్లో జరగనున్న కార్యక్రమంలో జక్లైర్ - కృష్ణా మధ్య కొత్త రైలు మార్గాన్ని నేడు జాతికి అంకితం చేయనున్నారు మరియు క్రిష్ణా రైల్వే స్టేషన్ నుండి కాచిగూడ వరకు (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా) మొట్ట మొదటి రైలు సర్వీస్‌ను జెండా ఊపి ప్రారంభం చేయనున్నారు. దీనితో పాటు గౌరవనీయులైన ప్రధాన మంత్రి ఈ కార్యక్రమంలో రహదారి, పెట్రోలియం మరియు సహజ వాయువు మరియు ఉన్నత విద్య వంటి ముఖ్యమైన రంగాలలో13,500 కోట్ల రూపాయల కంటే ఎక్కువ విలువైన అనేక ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు కూడా శంకుస్థాపన చేసి జాతికి అంకితం చేస్తారు. ఇటీవలి కాలంలో తెలంగాణ రైలు నెట్‌వర్క్ పరిధిలో వేగవంతమైన పరివర్తనకు సాక్షిగా నిలిచింది. నూతన లైన్ల ఏర్పాటులో, ఇప్పటికే ఉన్న లైన్ల విస్తరణలో, రైలు మార్గాల విద్యుదీకరణలో, కొత్త మౌళిక సదుపాయాల కల్పనలో, లేదా నూతన ప్రయాణసౌకర్యాల







ఏర్పాటులో రాష్ట్రం మునుపెన్నడూ లేని అభివృద్ధిని వీక్షించింది. ఈ పరివర్తనాత్మక వృద్ధిని ముందుకు తీసుకెళ్తూ, జక్లైర్ - క్రిష్ణా మధ్య నూతన రైలు మార్గాన్ని గౌరవనీయులైన ప్రధానమంత్రి జాతికి అంకితం చేస్తున్నారు. దీని ద్వారా దక్షిణ తెలంగాణలో రైలు అభివృద్ధిలో నూతన ఉషోదయానికి నాంది పలికింది. తెలంగాణలోని దక్షిణ జిల్లాలను రాష్ట్ర రాజధాని మరియు కర్ణాటకలోని రాయచూర్‌తో కలుపుతూ ఈ మార్గంలో రైలు సేవలను ప్రవేశపెట్టడం వల్ల ఈ ప్రాంతంలోని ప్రజల సామాజిక-ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. జక్లైర్ - క్రిష్ణా మధ్య 37.48 కిలోమీటర్ల మేర నూతన రైలు మార్గం దక్షిణ మధ్య రైల్వే ద్వారా అమలు చేయబడుతున్న మహబూబ్నగర్ - మునీరాబాద్ నూతన రైల్వే లైన్ ప్రాజెక్టులో భాగంగా ఉంది. దేవరకద్ర- కృష్ణా (65.825 కిమీలు) సెక్షన్ ప్రారంభంతో తెలంగాణ లో ఈ ప్రాజెక్టు మొత్తం భాగాన్ని పూర్తి అవుతుంది. క్రిష్ణా-జక్లే ర్ మధ్య నూతన లైన్ దాదాపు రూ. 504.89 కోట్ల వ్యయంతో పూర్తయింది. ఇప్పటికే ఉన్న క్రిష్ణా స్టేషన్ భవనంతో పాటు జక్లైర్, మగనూర్, మక్తల్ మరియు కుంసి హాల్ట్ అనే మరో నాలుగు కొత్త స్టేషన్ భవనాలు కూడా నిర్మించ బడ్డాయి. దక్షిణ తెలంగాణలోని మారుమూల ప్రాంతాలను రైల్వేచిత్రపటంలోకి తీసుకురావడం ద్వారా వాటిని అనుసంధానం చేస్తుంది. ఇంతేకాకుండా ఈ మార్గం ద్వారా బొగ్గు, సిమెంట్, క్లింకర్ మరియు ఇతర గనులు మొదలైన వాటి రవాణా పెరగడంతో సరుకు రవాణా పెద్ద ఎత్తున ఊపందుకుంటుంది. ఈ నూతన రైల్ మార్గం హైదరాబాద్ / సికింద్రాబాద్ నుండి హుబ్లీ



మరియు గోవాకు 100 కిమీల కంటే ఎక్కువ దూరాన్ని తగ్గిస్తుంది. కాచిగూడ-రాయచూ ర్-కాచిగూడ స్టేషన్ల మధ్య దేవరకద్ర-క్రిష్ణా మీదుగా నూతన రైలు సర్వీస్(డెమూ) ప్రవేశపెట్టబడింది. ఈ ప్రారంభ రైలు సర్వీసును గౌరవనీయులైన ప్రధాన మంత్రి క్రిష్ణా నుండి కాచిగూడ వరకు జెండా ఊపి ప్రారంభం చేయనున్నారు మరియు ఈ రైలు క్రిష్ణా నుండి కాచిగూడ వరకు నడవబడనుంది. కాచిగూడ మరియు రాయచూర్ మధ్య రోజువారీ రైలు సేవలు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ , నారాయణపేట మరియు రాయచూర్ జిల్లాలను కలుపుతూ నడపబడుతుంది. అందుబాటులో ఉన్న ఇతర రైలు మార్గాలతో పోలిస్తే ఈ రైల్ మార్గం కాచిగూడ మరియు రాయచూర్ల మధ్య అతి తక్కువ దూరం గల రైలు మార్గం. ఈ రైలు మహబూబ్నగర్ మరియు నారాయణపేట జిల్లాల్లోని ప్రజలకు రాజధాని వైపు సౌకర్యవంతమైన మరియు చౌకైనా రవాణా సౌకర్యాన్ని అందిస్తుంది. ఈ రైలు విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులు, కార్మికులు మొదలైన వారికి ప్రయోజనం కలగడమే కాకుండా మరియు నారాయణ పేటలోని చేనేత పరిశ్రమకు ఎంతగానో ఊతమిస్తుంది.

## "ప్రభుత్వం తెచ్చిన దిశా చట్టం ఎక్కడ..?



రాప్తాడు ప్రజాపాలన ప్రతినిధి: ఇంటర్ చదువుతున్న భవ్య శ్రీ కి న్యాయం చేయాలి అని రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భవ్య శ్రీ మృతి పై నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు మంజునాథ్ మాట్లాడుతూచిత్తూరు జిల్లా,పెనుమూరు మండలం, వేణుగోపాలపురం గ్రామానికి భవ్య శ్రీ మృతి పట్ల తీవ్రంగా ఖండించారు. భవ్య శ్రీ స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోందని చదువులో చలాకి గా ఉండే అమ్మాయి బావిలో శవమై తేలడం పలు అనుమానాలు రేకిత్తిస్తోందని ఈ ఘటనకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసి పోలీస్ వారు నిజనిజాలు వెలికి తీసి ఇందులో దోషులుగా తేలిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని తెలిపారు.భవ్య శ్రీ మృతి కేసులో న్యాయం చేయకుండా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముందు ధర్నాకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, సాయికుమార్, చిన్న పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

గుడివాడ ప్రజాపాలన ప్రతినిధి:రూరల్ మండలం రామన్నపూడి గ్రామ సచివాలయ పరిధిలో గద్దె పుష్పరాణి చేతుల జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా వారి చేయి పట్టుకుని నడిపించేలా ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దారని ఈ సందర్భంగా ఎంపీపీ కొనియాడారు. మండలం పరిధిలోని 12 సచివాలయాల పరిధిలో ప్రతి గ్రామాన్ని, ప్రతి ఇంటిని ఆరోగ్య సురక్షలో భాగంగా జల్లెడ పట్టి, అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేసి ప్రజలకు కావలసిన వైద్య సదుపాయాలను అందిస్తామని ఎంపీపీ తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశి భూషణ్, %వీఖణూ% వైస్ చైర్మన్ కంభంపాటి రాజ్యలక్ష్మి, %=ఖూ% మరియు గుడివాడ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ పి. పద్మావతి, తహశీల్దార్ కే.ఆంజనేయులు , ఎంపిడివో కుమారి వెంకటరమణ, వైయస్సార్సీపి మండల అధ్యక్షులు మట్టా జాన్ విక్టర్, వైయస్ఆర్సీపీ నాయకులు గద్దె రాము, %జుూా=ణ% డి. వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుంజ వంశీధర్, సర్పంచ్ మీగడ మురళీధర్ , సీపుడి సర్పంచ్ కలతోటి తోమస్, తట్టివర్రు సర్పంచ్ గంజి నిర్మల కుమారి , చిరిచింతల సర్పంచ్ తోట వీర రామయ్య , సచివాలయ కోఆర్డినేటర్ కారే జోసెఫ్ , ఇతర ప్రజా ప్రతినిధులు, డాక్టర్లు, మెడికల్ మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కుల, మతోన్మాదాన్ని పెంపొందించే నూతన జాతీయ విద్యా విధానం 2020 రద్దు చేయాలి

ప్రజాపాలన ప్రతినిధి:.జ్యోతిరావు గోవిందరావు పూలే ( 11 ఏప్రిల్ 1827బి28 నవంబర్1890 ) మహారాష్ట్ర చెందిన భారతీయ సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త, కుల వ్యతిరేక సంఘ సంస్కర్త మరియు రచయిత అతని పని అంటరానితనం మరియు కుల వ్యవస్థ నిర్మూలన మరియు మహిళలు మరియు అణగారిన కులాల ప్రజలకు విద్యను,అందించడంలో ఆయన చేసిన కృషితో సహా అనేక రంగాలకు విస్తరించింది, భారతదేశంలో స్త్రీల విద్యకు మార్గదర్శకులు, పూలే తన మొదటి బాలికల పాఠశాలను1848 లో పూణేలో తాత్యాసాహెబ్ బిడే నివాసం లేదా భిదేవాడలో ప్రారంభించాడు.

## అక్టోబర్ 15 కల్లా ఇళ్ల రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలి రెవెన్యూ, వీఎంసీ అధికారులతో ఆదేశాలు: ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి:విజయవాడ సెంట్రల్ సెంట్రల్ నియోజకవర్గంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను అక్టోబర్ 15 నాటికల్లా పూర్తిచేయాలని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశించారు. ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనములో శనివారం వీఎంసీ, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై



సుధీర్ఘంగా చర్చించారు. గతంలో ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల లబ్ధిదారులకు, కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని మల్లాది విష్ణు సూచించారు. గతంలో పలు సందర్భాలలో పునరావాస లబ్ధిదారులకు న్యూ రాజరాజేశ్వరిపేట, వాంబేకాలనీ సహా అజిత్ సింగ్ నగర్, బర్మాకాలనీ, పాకిస్తాన్ కాలనీ, రాధానగర్, సంతోషిమాత టెంపుల్ తదితర ప్రాంతాలలో కేటాయించిన దాదాపు 10 వేల ఇళ్లకు జీవో నెం.32 మరియు జీవో నెం.4 ల ప్రకారం త్వరితగతిన రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా జీవో నెం. 60 ద్వారా 100 గజాల లోపు ఇళ్లకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయాలని పేర్కొన్నారు. రెవెన్యూ, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో.. క్షేత్రస్థాయి సిబ్బందికి సరైన దిశానిర్దేశం చేస్తూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియనుపూర్తిచేయవలసిందిగా సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మాల్యాద్రి, జాయింట్ డైరక్టర్(వీఎంసీ హౌసింగ్) K.S.N.V.లత, నార్త్ ఎమ్మార్వో మాధురి, సెంట్రల్ ఎమ్మార్వో వెన్నెల శ్రీను, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు జగదీష్, మోహన్ బాబు, డిప్యూటీ తహసీల్దార్ జ్ఞాన లలిత, టీపీఓలు, పాల్గొన్నారు.

## ప్రజల పాలిట ఆరోగ్య రక్షణ కవచం జగనన్న అరోగ్య సురక్ష: సర్పంచ్ బుజ్జి బ్రదర్స్

పామూరు : ప్రజాపాలన ప్రతినిధి:కనిగిరి నియోజకవర్గం సిఎస్ పురం మండలం కోవిలంపాడు గ్రామ



పంచాయతీ లో గౌరవ శాసన సభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ మరియు సి ఎస్ పురం మండల రథసారథి ఎంపిపి మూడ మంచు వెంకటేశ్వర్లు యాదవ్ ఆదేశాలతో గౌరవ గ్రామ సర్పంచ్ బుజ్జి బ్రదర్స్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టారు. మొదట కోవిలంపాడు గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ కార్య క్రమంలో సచివాలయం సిబ్బంది ,మెడికల్ సిబ్బంది, తహసిల్దార్ నాగుర్ మీరా,ఎంపిడిఓ,రామచంద్ర రావు,ఈవో పి ఆర్ డి సుందరయ్య ,డాక్టర్ మురళి అదర్యం లో మండలం లోని మెడికల్ స్టాప్ తో క్యాంప్ కార్యాలయంలో కోవిలంపాడు స్కూల్ అవరణ విజయవంతం గా నిర్వహించారు గ్రామ పంచాయతీ లో శీలం వారి పల్లె మిట్ట పాలెం కోవిలంపాడు నుండి సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

## షాది ఖానాకు లక్ష రూపాయలు విరాళం ఇచ్చిన షంషూర్

కనిగిరి : ప్రజాపాలన ప్రతినిధి: కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణం లో షాదీ ఖానా మరమ్మత్తులకు పామూరు మండల వైసీపీ ప్రచార దళ్ అధ్యక్షులు షేక్ షంషూర్ లక్ష రూపాయలు విరాళంగా కనిగిరి శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ ద్వారా షాదీ ఖానా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ



కార్యక్రమంలో పామూరు మండల వైసీపీ అధ్యక్షులు గంగాసాని హుస్సేన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు షేక్ నాయబ్ రసూల్, ఖాదర్ బాషా, ఎంపీటీసీ అబ్దుల్, షేక్ చాంద్ బాషా (బుజ్జి) పంచాయతీ వార్డు సభ్యులు షేక్ జిలాని, నాయబ్ రసూల్, కోడి గుంపుల నాయబ్ రసూల్, షేక్ ఈనాడు హాజీ పాల్గొన్నారు.

## శిగినంశెట్టి రాముగుప్తా ఆధ్వర్యంలో పోతిన మహేష్ జన్మదిన వేడుకలు



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ పశ్చిమ నియోజకవర్గం జనసేన పార్టీ నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ జన్మదిన వేడుకలు స్థానిక రమణయ్య కూల్ డ్రింక్ షాప్ సెంటర్లో బాలాజీ స్వీట్స్ షాప్ పక్కన 37 వ డివిజన్ అధ్యక్షులుశిగినంశెట్టి.రాముగుప్తా ఆధ్వర్యంలో ముందుగా సర్దార్ మారుపిల్ల చిట్టి గారి విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించడం జరిగినది అనంతరం కేక్ కటింగ్ పండ్లు పంపిణీ కార్యక్రమం మరియు జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కిట్లు అందజేయడం జరిగినది అంతకుముందు పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో ఆటో పోస్టర్ లాంచింగ్ కూడా జరిగినది ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా జనసేన పార్టీ విజయవాడ ఉపాధ్యక్షులు వెన్న శివశంకర్ విచ్చేశారు.. ముందుగా డివిజన్ అధ్యక్షులు మాట్లాడుతూ వెల్లంపల్లి ఎటువంటి అభివృద్ధి జరగలేదని సాక్షాత్తు మొన్న పశ్చిమ నియోజకవర్గానికి విచ్చేసిన జగన్మోహన్ రెడ్డి సమక్షంలోనే అనేక సమస్యలు తలెత్తిన స్థానిక ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లారు ఇది వాస్తవం కాదా.?? ...ఈసారి 2024 లో పశ్చిమ నియోజకవర్గంలో జనసేన పార్టీ పోతిన మహేష్ భారీ ఎత్తు మెజారిటీలో గెలవటం ఖాయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు తవ్వా మారుతి పెటేటి నాంచారయ్య అడ్డగర్ల పుల్లారావు మాజేటి శ్రీనివాసరావు పొట్నురిగగన్ చల్లా ఏసుబాబు కిలాని రాము గజవల్లి దుర్గారావు దొమ్మిసినూకరాజు బెంగళూరు రాజేష్ మరియు జనసేన నాయకులు జన సైనికులుతదితరులు పాల్గొన్నారు

## 49వ డివిజన్ అధ్యక్షుడు అడ్డూరి తమ్మారావు ఆధ్వర్యంలో పోతిన మహేష్ జన్మదిన వేడుకలు



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి:విజయవాడ పశ్చిమ నియోజకవర్గం జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కి అత్యంత ఆప్తుడు.... నిరంతరం జనసేన పార్టీ విజయానికై పోరాడే వీరుడు... నిత్యం ప్రజల సమస్యల పరిష్కరించే దశగా కృషి చేస్తున్న సేవకుడు.. పరిచయం నియోజవర్గంలో కుల మతాలకతీతంగా అందరికీ బంధువు.. మా జనసైనికులు అందరికీ నాయకుడు.. విజయవాడ జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పోతిన వెంకట మహేష్ పుట్టినరోజు సందర్భంగా చిట్టినగర్ సెంటర్ 49వ డివిజన్ అధ్యక్షుడు అడ్డూరి తమ్మారావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ మరియు ఫ్రూట్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు ఈకార్యక్రమంలో..డివిజన్ ..కన్వీనర్. కత్తి రామయ్య,వైస్ ప్రెసిడెంట్. పట్నాల జయరాం, వైస్ ప్రెసిడెంట్ రాజు,,ప్రధాన కారియదర్శి మురుగు.కోటిగర్రె మురళీ..మొషా.ప్రధాన కార్యదర్శి.పీసా కిషోర్

## జనసేన పార్టీ లీడర్ పోతిన మహేష్ జన్మదిన రోజున ఉచిత మెడికల్ క్యాంపు.. ఎరుపల్లి కనకరావు

ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ పశ్చిమ నియోజకవర్గం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పోతిన వెంకట మహేష్ జన్మదిన సందర్భంగా. ఎరుపల్లి



కనకరావు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు చిట్టినగర్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారి నగరాల కళ్యాణ మండపం నందు పోతిన వెంకట మహేష్ జన్మదిన సందర్భంగా చిట్టినగర్ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ఉచిత మెడికల్ క్యాంపు ద్వారా...డాక్టర్ బండి గౌతమ్ కృష్ణ ఎండి. మరియు.డెంటల్ డాక్టర్ శివకళ్యాణ్ సుంకర ప్రముఖ డాక్టర్లతో వైద్య పరీక్షలు.. బాడీ చెకప్ మరియు దంత పరీక్షలు చేయించి అనేకమందికి సేవా కార్యక్రమాలు చేపట్టి ఉచిత పరీక్షలు చేసి ఉచితంగా మందులు. సిరప్.. ఫ్రూట్స్ పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకుడు.ఎరుపల్లి కనకరావు,మాట్లాడుతూ మా నగర అధ్యక్షుడు పోతిన వెంకట మహేష్ జన్మదిన సందర్భంగా ఈ సేవా కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఈరోజు ఇక్కడ ఉచిత మెడికల్ క్యాంపు నందు వందలాదిమంది మధ్యతరగతి కుటుంబాల వ్యక్తులకు పరీక్షలు చేస్తే ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో. ముఖ్యఅతిథిగా పోతిన విజయలక్ష్మి మరియు దేవస్థాన కమిటీ నగరాల సంఘం సభ్యులు.. మరియు.జిలేల అనిల్ కుమార్ .రాళ్ళపూడి గోవింద్ .బంటుపల్లి రాంబాబు . రమేష్.. పిల్లా సురేష్..

## గణేష్ మహారాజ్ ను దర్శించుకున్న జూలకంటి



కనిగిరి : ప్రజాపాలన ప్రతినిధి:గుంటూరులోని డొంక రోడ్డులో కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం మోపాడు గ్రామ తెలుగుదేశం నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విఘ్నేశ్వర మండపంలో మాచర్ల టిడిపి ఇన్చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి గణేష మహారాజ్ ను దర్శించుకున్నారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు గుర్రం వెంకటేశ్వర్లు జూలకంటిని స్వామివారి వస్త్రంతో సన్మానించి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డొంక రోడ్డు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తన విజ్ఞాన్ సంస్థల్లోని సిబ్బంది, విద్యార్థులతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినులకు అవగాహనా క్యాంపులు



పల్నాడు జిల్లా .నరసరావుపేట. సెప్టెంబర్ 30 (ప్రజాపాలన ప్రతినిధి): విద్యావేత్తగా, విజ్ఞాన్ సంస్థల అధినేతగా ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న మాదిరిగానే.. తన పార్లమెంట్ పరిధిలోని (పల్నాడులోని) ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలని, పల్నాటి బిడ్డలు కూడా విద్యలో గొప్పగా ముందుకు సాగాలని పరితపించే వ్యక్తి నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు.ఇందులో భాగంగా తాను ఎంపీ అయిన నాటి నుండి.. ప్రభుత్వ పాఠశాలలని తరుచూ సందర్శించి.. వాటి అభివృద్ధి కి పట్టుబడ్డారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి.. విద్యార్థులతో సమావేశం అయ్యి వారిలో చదువు పట్ల ఆసక్తి కలిగేలా మోటివేషన్ ప్రసంగాలు ఇచ్చారు. వారికి పుస్తకాలు వంటి ఉపకారణాలు అందించారు. పల్నాడులో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో దీనిని పరిష్కరించేలా.. ‘ విద్యవాలంటీర్లు ‘ అని కొత్త కార్యక్రమాన్ని చేపట్టి.. స్వచ్ఛంద సంస్థల సహాకారం తీసుకుని,, తన విజ్ఞాన్ సంస్థల ద్వారా పల్నాడులోని ఆయా గ్రామాల్లో డిగ్రీలు చదివిన యువతకు శిక్షణ ఇచ్చి..శాలరీలు ఇప్పించి.. విద్యార్థులకు బోధన చేయిస్తున్నారు. దీని ద్వారా విద్యార్థుల చేరికలు పెరిగాయి.ఇప్పుడు మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.విజ్ఞాన్ సంస్థల్లోని అనుభవం కలిగిన అధ్యాపకులని, సమాజ సేవ చేయాలన్న విద్యార్థులను టీమ్ లుగా చేసి.. పల్నాడు లోని ప్రభుత్వ పాఠశాలకు పంపి.. అక్కడి విద్యార్థునులకి విభిన్న అంశాలపై అవగాహన కల్పన జరిగేలా చేస్తున్నారు.ప్రభుత్వ బడుల్లో 6వ తరగతి నుండి 10వ తరగతి చదివే విద్యార్థినులకి.. బాల్య వివాహల పైన, లింగ వివక్ష త పైన, ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధిపైన, విద్య యొక్క ఆవశ్యకత పైన,ప్రజెక్టర్ లు ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.ఇప్పటి వరకు నరసరావుపేట నియోజకవర్గం లోని 18 జిల్లా పరిషత్ పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహనా తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం సత్తెనపల్లి నియోజకవర్గంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని పల్నాట ఉన్న అన్ని జిల్లా పరిషత్ పాఠశాలల్లో జరిగేలా ప్రణాళికను రూపొందించారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మార్పు తీసుకుని రావాలన్నదే ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు సంకల్పం.

## జగనన్న సురక్షిత కార్యక్రమం



వెదురు కుప్పం ప్రజాపాలన న్యూస్. వెదురు కుప్పం మండలం నల్లవెంగనంపల్లె హైస్కూల్ మైదానంలో నిర్వహించిన జగనన్న సురక్షిత కార్యక్రమంలో ఈరోజు ముఖ్య అతిధులుగా జడ్పిటిసి సుకుమార్ జగనన్న సురక్షిత పాల్గొన్నారు జడ్పిటిసి మాట్లాడుతూ జగనన్న పెట్టిన పథకాలు గాని జగనన్న సురక్షిత ఎంతోమందికి ఆ భాగ్యులకు మండలాల్లో గానిప్రతి గ్రామంలో కూడా రోగులకు మంచి వైద్యం అందిస్తున్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి రుణపడి ఉండాలని మీరందరూ కోరుకోండి అని తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమ సుందర్ రెడ్డి ప్రసంగిస్తూ రాబోయే ఎన్నికల్లో అత్యధిక ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిచే గెలుపొందాలని చేశారు. అంతేకాకుండా మనము ఇలాంటి కంటి అద్దాలు గాని మనకు ఒంటికి సంబంధించిన ఎటువంటి వైద్యం అందించే వ్యక్తి ఎవరంటే మన జగనన్న అని చెప్పుకోవాలి ఎందుకంటే దివంగతి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూడా మంచి 104 అంబులెన్స్ ప్రవేశపెట్టారు. విధంగా ఆరోగ్యశ్రీ ఎంతోమంది అభాగ్యులు అవకాశాన్ని చేసుకున్నారని తెలియజేశారు. మన గవర్నమెంట్ ద్వారా కిడ్నీలు, అప్రెంటిసిలు మరెన్నో వ్యాధులు కు బాధపడుతున్న ప్రజలకు సీఎం రిలీజ్ పండు ద్వారా రుణం కూడా ఇవ్వడం జరిగింది. జగనన్న సురక్షిత ప్రతి గ్రామాల్లో కూడా కార్యక్రమం ఈ కార్యక్రమం జరుగుతుంది ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో సుధాకర్ రావు, వైద్య అధికారి డాక్టర్ సురేఖ, జడ్పిటిసి సుకుమార్, సచివాలయాల కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు కామసాని పద్మనాభరెడ్డి, చిత్తూరు జిల్లా సంయుక్త కార్యదర్శి బండి హేమ సుందర్ రెడ్డి. నల్ల వేగనంపల్లె సర్పంచ్ శివాజీ, కో ఆప్షన్ నెంబర్ వెంకటేష్, పుత్తూరు మార్కెటింగ్ మాజీ డైరెక్టర్ రామయ్య, వైఎస్ఆర్సిపి యువ నాయకుడు గణపతి రెడ్డి, యువ నాయకుడు డేనియల్, సచివాలయం సిబ్బంది వాలంటరీ వ్యవస్థ ఏఎన్ఎం నర్సులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నూజివీడులో సినిమా సందడి



నూజివీడు, ప్రజాపాలన ప్రతినిధి: నూజివీడు పట్టణంలో శుక్రవారం సినిమా సందడి నెలకొంది. పట్టణానికి చెందిన యువ దర్శకుడు బుర్రి సుధాకర్ దర్శకత్వ నేపథ్యంలో పల్లవి ప్రణవి ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో కాల గమనం అనే తెలుగు చిత్ర నిర్మాణానికి నూజివీడు శాసనసభ్యులు మేక వెంకట ప్రతాప్ అప్పారావు ఫస్ట్ క్లాస్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ నూజివీడుకు చెందిన వర్ధమాన దర్శకుడు సుధాకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న కాల గమనం తెలుగు చలనచిత్రం ప్రపంచవ్యాప్తంగా ఘన విజయం సాధించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత నూతక్కి వేణుగోపాలరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధి మరడ చెన్నారావు, దళిత జేఏసీ నేత నత్తా నాగేశ్వరరావు, ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ యూట్యూబర్స్, చిత్రంలో నటించే నటీనటులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

## అల్లూరు గ్రామంలో “జగనన్న ఆరోగ్య సురక్ష” క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



వీరులపాడు సెప్టెంబర్ 30 ప్రజా పాలన ప్రతినిధి మం డలంలోని అల్లూరు గ్రామంలో “జగనన్న ఆరోగ్య సుర క్ష” క్యాంపు ను శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జ గన్ మోహన్ రావు శనివారం ప్రారంభించి, వైద్యారో గ్య సిబ్బందికి పలు సూచనలు చేశారుఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జ గన్ మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుం చే ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారని, రాష్ట్రంలోని ఆసుపత్రులను అధునికరించి, వైద్య సే వలను మెరుగుపరిచారన్నారు. దేశంలోనే ఎక్కడా లే నివిధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్య సేవలను ప్రజలు ముంగిటికే చేర్చారని తెలిపారు. ఇప్పుడు ప్ర తి ఒక్కరి ఆరోగ్యం గురించి వాకబు చేసి, ముందస్తు గానే వారి ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు చె ప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో ఉన్న ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి ప్రభుత్వ సిబ్బంది వా కబు చేస్తారని, ఆ తర్వాత వైద్య శిబిరాల్లో పరీక్షలు చేసి అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందిస్తా రని వెల్లడించారు. దీని ద్వారా ఆరోగ్య సమస్యలు మరింత పెద్దవై, చికిత్సకు లొంగని దశకు చేరకుండా ముందుగానే గుర్తించి, వైద్యం అందించి, ఆరోగ్యవం తులుగా చేయడం ముఖ్యమంత్రి వైయస్ జగన్ మో హన్ రెడ్డి చేపట్టిన కార్యక్రమ ఉ ద్దేశమన్నారుఈ కార్య క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## జగనన్న ఆరోగ్య సురక్ష తెలుగు ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష స్వామినేని వెంకటకృష్ణ ప్రసాద్



పెనుగంచిప్రోలు సెప్టెంబర్ 30ప్రజాపాలనప్రతినిధి శా సనసభ్యులు సామినేని ఉదయభాను తనయులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ తెలుగు ప్రజల ఆరో గ్యానికి శ్రీరామరక్ష జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని యువనేత సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో శనివారం నాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామాభివృద్ధి కమిటీ చై ర్మన్ వేల్పుల రవికుమార్ అధ్యక్షతన జరిగిన జగన న్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సామినేని వెంకట కృ ష్ణ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా కృష్ణ ప్రసాద్ మాట్లా డుతూ రాష్ట్రవ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమం పెద్ద ఎత్తున ప్రారంభించడం జరిగిందని తెలు గు ప్రజల ఆరోగ్యానికి సంబంధించి ముఖ్యమంత్రి జ గన్ మోహన్ రెడ్డి గారు అత్యంత చొరవ తీసుకుంటు న్నారని ఆయన కొనియాడారు తెలుగు ప్రజలందరూ ఆరోగ్యంగా సౌభాగ్యంగా సుభిక్షంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న ఆశయమని ఆయన చెప్పా రు ప్రతి ఇంటిని వాలంటీర్లు గృహ సారథులు సచివా లయ కన్వీనర్లు ఆశా వర్కర్లు ఆరోగ్య మిత్రా లు ప్రజా ప్రతినిధులు ప్రతి గడపగడప జల్లడ పట్టి ప్రజలను క లుసుకొని వారి ఆరోగ్య వివరాలను సేకరించి పరీక్షిం చి వారికి మందులు ఇప్పించే బాధ్యతనుఈప్రభుత్వం చేపట్టిందని కృష్ణ ప్రసాద్చెప్పారుగ్రామపంచాయతీలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి పెద్ద ఎ త్తున ప్రజలు పోటెత్తారు ఈ కార్యక్రమంలో పాల్గొని వివిధ వైద్య నిపుణుల చేత పరీక్షలు చేయించుకొని తగిన విలువైన నాణ్యమైన మందులను తీసుకొని సంతోషంగా వెళ్లారుఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సభ్యురాలు వుట్ల నాగమణి గ్రామ ఉప సర్పంచ్ బా డిస పాపారావు జిల్లా జగనన్న ఆరోగ్యశ్రీ ప్రోగ్రాం కోఆ ర్డినేటర్ మోతి బాబు వైద్యాధికారిణులు డాక్టర్ ఇం దిరా డాక్టర్ సుజని తాసిల్దార్ శ్రీమతి కే కళ్యాణి సి డిపిఓ లక్ష్మీ భార్గవి ఏవో సిద్ధారెడ్డి సచివాలయ గ్రేడ్ 5 కార్యదర్శి రామకృష్ణ మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు విద్యా కమిటీ చైర్మన్ బత్తుల వెం కటనర్సు వార్డు మెంబర్లు గుజ్జర్లపూడి రాంబాయి చే ను భుత్వ వైద్యశాల అధికారులు ఆశావర్కర్లువా లం టీర్లు,పంచాయితీ సిబ్బంది గ్రామప్రజలు పాల్గొన్నారు.

## కాకాని గ్రామంలో నిర్మాణంలో ఉన్న జేఎన్టీయూ-కె యూనివర్సిటీని సందర్శించిన నరసరావుపేట శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



పల్నాడు జిల్లా. నరసరావుపేట .సెప్టెంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి.): నరసరావుపేట మండలంలోని కాకాని గ్రామంలో నిర్మాణంలో ఉ న్న జేఎన్టీయూ–కె యూనివర్సిటీని శనివారం లినరసరావుపేట గౌరవ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మరియు APSCHE చైర్మన్ హేమచంద్ర రెడ్డి , జేఎన్టీయూ–కె యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ జి.వి.ఆర్ ప్రసాద్ రాజు కలిసి యూనివర్సిటీని సందర్శించినారు..లి అనంతరం నిర్మాణంలో ఉన్న యూనివర్సిటీని సంబంధించిన ఇంజనీర్లు తరగతి గదులను, ఇంజనీరింగ్ విభాగములు, ల్యాబ్, సీ.సీ రోడ్డులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలు గౌరవ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కి ఇంజనీర్లు వివరించారు. అదేవిధంగా యూనివర్సిటీలో పనిచేస్తున్న సిబ్బంది వారి పడుతున్న ఇబ్బందులను డా.గోపిరెడ్డి కి వివరించారు తక్షణమే స్పందించి సంబంధించిన యూనివర్సిటీ అధికారులకు దృష్టికి డాగోపిరెడ్డి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్, హెచ్ ఓ డి లు అసిస్టెంట్ ప్రొఫెసర్లు మరియు కాలేజీ సిబ్బంది, యూనివర్సిటీ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీ జడ్పిటిసి ఎంపీటీసీలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## పూలే ఆశించిన అసమానతలు లేని సమాజం కోసం పోరాడుదాం: ఎం.రామకృష్ణ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: వివక్ష మరియు అసమానతలు లేని సమాజం కోసం మహాత్మా జ్యోతిబాపూలే సత్యశోధక్ సమాజ్ ద్వారా అలుపెరగని పోరాటం చేశారని ఎం రామకృష్ణ అన్నారు. సత్యశోధక్ సమాజ్ 150వ ఆవిర్భావ దినం సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర కమిటీ బ్రాహ్మణిజాన్ని, సనాతన ధర్మాలను సుస్థిరం చేసే మోడీ ప్రయత్నాలకు వ్యతిరేకంగా మరియు అసైన్మెంట్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 24 నుంచి 30 వరకు సభలు నిర్వహించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజాశక్తి నగర్ చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో సభ నిర్వహించారు. ఈ సభలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర్ కార్యదర్శి ఎం. రామకృష్ణ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు కావస్తున్న ప్రజల మధ్య కుల వివక్ష అసమానతలు రూపుమాపడానికి పాలకవర్గాలు ప్రయత్నించక పోగా ప్రోత్సహిస్తూ వచ్చారు . ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మరింత వివక్ష అసమానతలు పెంచే సనాతన ధర్మాన్ని పుక్కిటి పురాణాలను, సంస్కృతాన్ని హిందీ భాషని అమలు చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తుందని అంతిమంగా మను రాజ్యాంగాన్ని రూపొందించడమే కర్తవ్యం గా భావిస్తున్నారని అన్నారు.రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అసైన్డ్ భూములకు చట్ట సవరణలు చేసి దళితులకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. బ్రాహ్మణ హిందుత్వ మతం అనేది మూడ విశ్వాసాలకు వ్యతిరేకంగా మహాత్మా జ్యోతిబాపూలే ,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ,నారాయణ గురు ,పెరియర్లు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు వారి ఆశించిన నూతన సమాజం కోసం కార్మికులు, కర్షకులు, విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సభకు రవీంద్ర అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కనకారావు, రమణ, రవీంద్ర, విగ్నేష్, శ్రీను, భాస్కర్, జాషువా తదితరులు పాల్గొన్నారు

## కొండ శిలువను అడివిలో వదిలిపెట్టిన ఫారెస్ట్ శాఖ సిబ్బంది



రాజుపాలెం ప్రజాపాలన : రాజుపాలెం మండలం కొండమోడు పుట్టగడ్డ వద్ద గల వరి వామిలో కొండచిలువ ఉ న్నట్లు రైతు ఫారెస్ట్ శాఖ వారికి సమాచారం ఇవ్వడంతో స్థానిక కొంతమంది సహాయంతో కొండచిలువని గోత్రం బంధించి దేవరంపాడు అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు ఈ విషయాన్ని వెంటనే స్పందించిన ఫారెస్ట్ డిఆర్ఓ నీలిమ బీట్ ఆఫీసర్ గోవిందరాజులు సిబ్బంది అంకాల దాసుఎస్ కే భాష ని అభినందించారు

## ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయటం ద్వారా బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కోల్పోతున్నారు




పల్నాడు జిల్లా .నరసరావుపేట. సెప్టెంబర్ 30 (ప్రజాపాలన ప్రతినిధి.): దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయటం ద్వారా బడుగు బలహీన వర్గాలు రిజర్వేషన్లు కోల్పోతున్నాయని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, పల్నాడు జిల్లా యువజన కాంగ్రెస్ జోనల్ ఇన్చార్జి కొండేపి సందీప్ అన్నారు .శనివారం పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ బలోపేతం కోసం సమీక్ష సమావేశం నిర్వహించారు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిసిసి అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ నిర్వహించిన భారత జోడోయాత్ర తర్వాత కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరిగిందని అన్నారు యూత్ కాంగ్రెస్ను అవార్ చేసే విధంగా కాంగ్రెస్ పార్టీ కొన్ని కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన 107 108 జీవోలతో మెడికల్ విద్యార్థులను దెబ్బతీసిన వైనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై యూత్ కాంగ్రెస్ బలంగా స్వరం వినిపిస్తుందని అన్నారు వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించే విధంగా సూచనలు కనపడుతున్నాయని యూత్ కాంగ్రెస్ ప్రజల పక్షాన పోరాటాలకు సిద్ధమవుతుందని తెలియజేశారు.

## సూపర్ స్పెషలిటీ వైద్యసేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం



కారంపూడి..సెప్టెంబర్30...ప్రజాపాలన... ప్రతినిధి: ప్రతిఒక్కరికి మంచి ఆరోగ్యాన్ని అందించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని నరమాలపాడులో శనివారం జరిగిన ఆరోగ్యసురక్ష ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఎంపిపి మేకల. శారదశ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ షేక్. షఫీ, మండల స్పెషల్ ఆఫీసర్ డోమా పి.డి జోసఫ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రతిఒక్కరికి ఆరోగ్యఫలాలను అందించి ఉచితంగా మందులను కూడా అందించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ పథకం ద్వారా సూపర్ స్పెషలిటి వైద్యసేవలు గ్రామస్థాయిలో పేదప్రజలకు అందించడమే ఈ పథకం యొక్క ముఖ్యఉద్దేశం. ఈ సందర్భంగా పీహెచ్ సి వైద్యఅధికారి డాక్టర్ దుర్గరావు, గాదెవారిపల్లి పి. హెచ్. సి వైద్యులు విజయనాయక్, సూపర్ స్పెషలిటి వైద్యులు నాగేంద్రబాబు, పొట్ల. రవిప్రసాద్ ఆధ్వర్యంలో క్యాంపులో పాల్గొన్న వారికీ వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణి చేశారు. కంటి వైద్యాలచే కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికీ కళ్ళజోడులు కూడా అందించడం జరుగుతుందని వారు తెలిపారు. ఇది ఇలా ఉండగా మండల స్పెషల్ ఆఫీసర్ జోసఫ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఎంపీడిఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో, ఎంపీపి, జడ్పీటీసీ ఇతర నాయకులు, అధికారుల సమక్షంలో కేకు కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఆర్. జి. ఎస్ ఏపిఓ ఏడుకొండలు, ఇంచార్జి ఈఓపిఆర్డి కాసిన్యనాయక్, సచివాలయకన్వీనర్ అల్లు. వెంకటేశ్వరరెడ్డి, నరమాలపాడు సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, వైసీపీ నాయకులు తిరుపతిరావు, సైదారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయిని పరామర్శించిన పులివర్తి నాని...



తిరుపతి, సెప్టెంబర్ 30 (ప్రజాపాలన న్యూస్): చంద్రగిరి పట్టణంలోని రెడ్డివీధికి చెందిన ధనంజయ రెడ్డి కుమారుడు సాయిని సిమ్స్ హాస్పిటల్ లో వైద్యం పొందుతున్న విషయం తెలుసుకున్న పులివర్తి నాని హాస్పిటలకు చేరుకుని సాయిని పరామర్శించడం జరిగింది. అనంతరం వైద్యులు అందిస్తున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులను సాయికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. నాని వెంట టిడిపి నాయకులు సుబ్రమణ్యం నాయుడు, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## టాక్..నాని నెక్స్ట్ లో తమిళ యంగ్ హీరోయిన్?



నాచురల్ స్టార్ నాని హీరోగా ఇప్పుడు తన కెరీర్ లో బెంచ్ మార్క్ చిత్రం 30 వ సినిమా "హాయ్ నాన్న" లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రాన్ని యంగ్ దర్శకుడు శౌర్యువ్ తెరకెక్కిస్తూ దర్శకునిగా పరిచయం అవుతున్నాడు. ఇక ఈ సినిమా తర్వాత నాని తన కెరీర్ లో 31వ సినిమాని దర్శకుడు వివేక్ ఆత్రేయ తో చేయనున్న సంగతి తెలిసిందే. తనతో ఆల్రెడీ చేసిన "అంటే సుందరానికీ!" చిత్రానికి మంచి మార్కులు కూడా వచ్చాయి.దీనితో రెండో సినిమా కోసం అందరిలో మంచి అసతి నెలకొనగా ఈ చిత్రంని అయితే దర్శకుడు సాలిడ్ యాక్షన్ ఎంటర్టైనర్ గా అయితే తెరకెక్కిస్తున్నాడు. మరి ఈ చిత్రంలో అయితే హీరోయిన్ గా ఎవరు చేస్తారు అనేది ఇన్ని రోజులు ఆసక్తిగా మారగా ఫైనల్ గా అయితే ఇప్పుడు తమిళ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్ లాక్ అయ్యింది అని తెలుస్తుంది. దీనితో ఈ ఇంట్రెస్టింగ్ పెయిర్ ఫిక్స్ అయ్యింది అని చెప్పాలి. అలాగే దీనిపై అధికారిక క్లారిటీ రానున్న రోజుల్లో రానుంది.

## గుంటూరు కారం మెలోడీ.. రెండింటిలో ఏదో ఒకటి



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు గుంటూరు కారం సినిమా ఫస్ట్ సాంగ్ ఎప్పుడు వస్తుందో అని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సాంగ్ అప్డేట్ విషయంలో ఎంత ఆసక్తిగా ఉన్నారో అంతే టెన్షన్ తో కూడా ఉన్నారు అని చెప్పాలి. ఎందుకంటే ఇటీవల కాలంలో మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఇచ్చినా ట్యూన్స్ అంతగా క్లిక్ కావడం లేదు. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విషయంలో కూడా అతను కిక్ ఇవ్వడం లేదు అని రొటీన్ గానే కొడుతున్నాడు అనే విధంగా కామెంట్స్ కూడా వస్తున్నాయి. అప్పుడు తిట్టి ఇప్పుడు పొగిడాడు! దీంతో ఇప్పుడు త్రివిక్రమ్ కాంబినేషన్లో మహేష్ బాబు కోసం అతను ఎలాంటి ట్యూన్ రెడీ చేశాడు అనేది ఆసక్తిగా మారింది. త్రివిక్రమైతే మంచి ట్యూన్స్ ఇచ్చేవరకు అసలు వదిలి పెట్టడు. అల.. వైకుంఠపురములో.., అరవింద సమేత సినిమాలకు తమన్ ఇచ్చిన మ్యూజిక్ బాగానే వర్కౌట్ అయింది. కాబట్టి ఈ సినిమాకు కూడా థమన్ చేత మాటల మాంత్రికుడు మంచి మాటలు సిద్ధం చేయిస్తాడు అని ఓ వర్గం ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఇక ఈ మొదటి సాంగ్ ఎలా ఉంటుంది ఎప్పుడు వస్తుంది అనే విషయంలో ఇప్పటికే కొన్ని లీక్స్ వచ్చాయి. నిర్మాత నాగవంశి అయితే ఈ సినిమా ఫస్ట్ సాంగ్ దసరా కంటే ముందే ఉంటుంది అని ఇటీవల క్లారిటీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇన్ సైడ్ టాక్ ప్రకారం మొదటి పాట మెలోడీగా ఉండబోతుందట. ఇక ఆ పాటను అనురాగ్ కులకర్ణి పాడినట్లుగా తెలుస్తోంది. అయితే రెండు వెర్షన్లలో పాటలను రచించినట్లు సమాచారం. ఒకరు రామ జోగయ్య శాస్త్రి, మరొకరు కాసర్ల శ్యామ్ ఇద్దరితో కూడా రెండు వర్షన్స్ రాయించగా అనురాగ్ కులకర్ణి ఆ రెండిటిని పాడినట్లుగా తెలుస్తోంది. ఇక ఏది బాగుంటే దాన్ని ఫైనల్ చేసి త్వరలోనే అప్డేట్ ఇవ్వాలని అనుకుంటున్నారు. దసరా కంటే ముందే పాట ఆడియన్స్ ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఇక ఈ సినిమాను 2024 సంక్రాంతికి విడుదల చేయాలని అనుకుంటున్న విషయం తెలిసిందే. వాయిదా పడే అవకాశం ఉంది అని ఆ మధ్య టాక్ వినిపించినప్పటికీ అందులో ఎలాంటి నిజం లేదు అని నిర్మాతలు క్లారిటీ ఇచ్చేశారు.

## 'సలార్' : ప్రభాస్ ఫ్యాన్స్ కి గుడ్ న్యూస్





పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్ లేటెస్ట్ మూవీ సలార్ డిసెంబర్ 22న గ్రాండ్ గా ఆడియన్స్ ముందుకి రానున్న విషయం తెలిసిందే. ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన ఈ మూవీలో శృతి హాసన్ హీరోయిన్ గా నటించగా హొంబలె ఫిలిమ్స్ బ్యానర్ పై విజయ్ కిరాగందూర్ భారీ స్థాయిలో నిర్మించారు. మొదటి నుండి అందరిలో భారీ అంచనాలు కలిగిన సలార్ కి రవి బస్రూర్ సంగీతం అందించగా భువన గౌడ ఫోటోగ్రఫి అందించారు. అతి త్వరలో సలార్ నుండి సాంగ్స్ తో పాటు ట్రైలర్ కూడా రానున్నాయి. కాగా మ్యాటర్ ఏమిటంటే, యుఎస్ఏ లో సలార్ ని 1979 కి పైగా లొకేషన్స్ లో గ్రాండ్ లెవెల్లో రిలీజ్ కానుందని తాజాగా మేకర్స్ తెలిపారు. ఇంత భారీ స్థాయిలో యుఎస్ఏ లో రిలీజ్ అవుతున్న తొలి సినిమా సలార్ కావడం విశేషం. మరోవైపు షారుఖ్ ఖాన్ డన్కి అలాగే హాలీవుడ్ మూవీ ఆక్వా మ్యాన్ 2 మూవీస్ కూడా అదే సమయంలో రిలీజ్ కానున్నప్పటికీ ఏమాత్రం కంప్రమైజ్ కాకుండా అక్కడ ఇంత భారీ స్థాయిలో సలార్ ని రిలీజ్ చేసేందుకు మేకర్స్ ఫిక్స్ అయ్యారు. తప్పకుండా తమ మూవీ అన్ని భాషల్లో అలానే అన్ని ప్రాంతాల్లో అదరగొట్టే కలెక్షన్ రాబట్టి మంచి విజయం అందుకుంటుందని సలార్ టీమ్ అభిప్రాయపడుతోంది.

## సంక్రాంతికి సుందర్ దెయ్యాలు




వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాలు రిలీజ్ చేయడం కోసం ఇప్పటి నుంచి స్లాట్ బుక్ చేసేసుకుంటున్నారు. ఇప్పటికే టాలీవుడ్ లో నాలుగు సినిమాలు సంక్రాంతి బరిలో పోటీకి సిద్ధంగా ఉన్నాయి. సూపర్ స్టార్ మహేష్ బాబు గుంటూరు కారం సంక్రాంతికి రావడం ఖాయంగా అయిపోయింది. అలాగే ప్రశాంత్ వర్మ సూపర్ హీరో మూవీ హనుమాన్ కూడా రిలీజ్ కానుంది. రవితేజ ఈగల్ తో రాబోతున్నాడు. అలాగే నాగార్జున నా సామి రంగా అంటూ రెడీ అవుతున్నారు. ఇలా స్ట్రైట్ తెలుగు సినిమాలే నాలుగు సంక్రాంతికి రాబోతున్నాయి. ఇవి కాకుండా ఇప్పుడు తమిళ్ డబ్బింగ్ సినిమాలు కూడా వీటికి పోటీగా సంక్రాంతి రేసులో ప్రేక్షకుల ముందుకి రావడానికి సిద్ధంగా ఉన్నాయి. శివ కార్తికేయన్ హీరోగా తెరకెక్కుతోన్న ఫిక్షనల్ స్టోరీ అయలన్ సంక్రాంతికి రిలీజ్ కాబోతోంది. ఈ చిత్రం తమిళ్ తో పాటు తెలుగులో కూడా ప్రేక్షకులని పలకరించనుంది. ఇప్పుడు సుందర్ సి నుంచి వచ్చే అరణ్మణి సిరీస్ లో 4వ మూవీ తెరకెక్కుతోంది. ఇందులో రాశీఖన్నా, తమన్నా బాటియా కీలక పాత్రలలో నటిస్తున్నారు. ఈ అరణ్మణి సిరీస్ లో వచ్చే హర్రర్ చిత్రాలు తెలుగులో ఎవరేజ్ టాక్ తెచ్చుకున్న తమిళనాట హిట్ అవుతున్నాయి. అందుకే సుందర్ సి ఈ సిరీస్ ని కొనసాగిస్తున్నారు. ఇందులో నాలుగో చిత్రంలో రాశీఖన్నా, తమన్నా ఇద్దరూ దెయ్యాలుగా నటిస్తున్నారంట.వారితో ప్రేక్షకులని భయపెట్టడానికి సిద్ధమైన సుందర్ సి ఈ చిత్రాన్ని తెలుగులో కూడా రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. తమిళంలో సంక్రాంతి రేసులో ఒక్క అయలన్ మూవీ తప్ప పెద్ద సినిమాలు ఏవీ రిలీజ్ కావడం లేదు. అందుకే తన అరణ్మణి 4ని ఆ టైంలో ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చే ప్లాన్ లో ఉన్నారు. త్వరలో పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ స్టార్ట్ చేస్తారంట. కచ్చితంగా ఈ సినిమా సూపర్ హిట్ అవుతుందని కాన్ఫిడెంట్ గా ఉన్నారు. తెలుగులో పెద్ద సినిమాల మధ్య ప్రేక్షకులకి రీచ్ కాకున్నా తమిళంలో మాత్రం కచ్చితంగా వర్క్ అవుట్ అవుతుందని నమ్ముతున్నారంట. అందుకే సంక్రాంతికి తన చిత్రాన్ని రిలీజ్ చేయాలనే ఆలోచనలోనే సుందర్ సి ఉన్నట్లు కోలీవుడ్ సర్కిల్ లో వినిపిస్తోన్న మాట.

## "చరణ్ 16" పై ఇంట్రెస్టింగ్ అప్డేట్.!




గ్లోబల్ మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ఇప్పుడు మావెరిక్ దర్శకుడు శంకర్ తో "గేమ్ చేంజర్" అనే సెన్సేషనల్ ప్రాజెక్ట్ ని చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. మరి ఈ భారీ సినిమా అనంతరం చరణ్ తన కెరీర్ 16వ సినిమాని దర్శకుడు బుచ్చిబాబు సానా తో చేయనున్న సంగతి తెలిసిందే.ఈ సినిమా విషయంలో అయితే చరణ్ సూపర్ కాన్ఫిడెన్స్ లో ఉండగా ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు. అయితే ఈ చిత్రానికి పాన్ ఇండియా మ్యూజిక్ డైరెక్టర్ ఏ ఆర్ రెహమాన్ వర్క్ చేస్తున్న సంగతి తెలిసిందే.మరి ఇప్పుడు ఇంట్రెస్టింగ్ అంశం ఏమిటంటే ఈ చిత్రానికి రెహమాన్ ఇప్పుడు ఆల్రెడీ ఓ సాంగ్ ని కంపోజ్ చేయడం అది ఓకే కూడా అయిపోవడం జరిగిందని తెలుస్తుంది. అంతే కాకుండా మిగతా మ్యూజికల్ పనులు కూడా ఈ చిత్రానికి ఇప్పుడు జరుగుతున్నాయి అని టాక్. దీనితో అయితే మేకర్స్ పర్ఫెక్ట్ ప్లానింగ్ తో ముందుకు వెళ్తున్నారని చెప్పాలి.

## తారక్ 31 పై ప్రశాంత్ నీల్ ఇంట్రెస్టింగ్ అప్డేడ్!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే స్టోరీ లాక్ అయింది. అయితే ఆ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి తీసుకెళ్తారు? అన్నదానిపై సరైన క్లారిటీ లేదు. మరోవైపు టైగర్ 'దేవర' షూటింగ్ లో బిజీగా ఉండటం...కొరటాల శివ తెరకెక్కిస్తో న్న ఆ సినిమా షూటింగ్ కూడా ఆలస్యమయ్యే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. దీంతో ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్ పై క్లారిటీ మిస్ అయింది. ఈ ఏడాది ప్రారంభం అవుతుందా? వచ్చే ఏడాది మొదలు పెడతారా? అన్న దానిపై అభిమానుల్లో పెద్ద ఎత్తున చర్చ సాగింది. తాజాగా వాటన్నింటికి ప్రశాంత్ నీల్ తెర దించేసారు. ప్రాజెక్ట్ ఎప్పుడు ప్రారంభిస్తారు? అన్నది రివీల్ చేసారు. తారక్ అభిమానులు చిల్ అయ్యే వార్త ఒకటి వెల్లడించారు. తారక్ తో తన సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ లేదా మేలో ప్రారంభమవుతుందని ప్రకటించారు. అప్పుడు తిట్టి ఇప్పుడు పొగిడాడు! అంటే 'దేవర' రిలీజ్ అయిన వెంటనే ఈ కాంబినేషన్ సెట్స్ కి వెళ్ళిపోతుందని అధికారికంగా క్లారిటీ వచ్చేసింది. ఇక ఈ ప్రాజెక్ట్ పై తారక్ అభిమానుల్లో ఎలాంటి అంచనాలున్నాయో చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం ప్రభాస్ తో 'సలార్' తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా డిసెంబర్ లో రిలీజ్ అవుతుం ది. ఈ భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ గనుక భారీ విజయం సాధిస్తే తారక్ 31 పై అంచనాలు ఇంకా పీక్స్ కి చేరిపోతాయి. ఇప్పటికే ఈ సినిమా స్టోరీ లైన్ ఎలా ఉంటుంది? ఎలాంటి అంశాన్ని తీసుకున్నారని ప్రేక్షకాభిమానుల్లో ఒకటే ఉత్కంఠ నెలకొంటుంది. భారీ యాక్షన్ చిత్రని క్లారిటీ ఉంది గానీ కంటెంట్ ఎలా ఉండబోతుంది అన్న ఆసక్తి రేకెత్తిస్తుంది. మరి ఆ సంగతేంటో తెలియాలంటే ఇంకా కొన్ని నెలలు ఆగాల్సిందే. సలార్ డిసెంబర్ లో రిలీజ్ అవుతోన్న నేపథ్యంలో ప్రశాంత్ ఆ సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.